



# విజయభాను




విజయవాడ, శనివారం 19-08-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 77 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## సేంద్రియ పంటలతో
# రెండింతల ఆదాయం



విజయవాడ: సేంద్రీయ పద్ధతుల్లో పంటలను సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని, దీంతో రైతులకు ఆదాయం రెండింతలు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడ నగరంలోని సిద్దార్థ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సేంద్రియ, ఉద్యాన, నర్సరీ మేళాను ముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌ను పరిశీలించి వాటి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయం రంగంలో ఈ ప్రదర్శన నూతన చరిత్రకు శ్రీకారం చుట్టనుందని చెప్పారు. కొంతమంది ఎరువుల దుకాణ దారులు వారి లాభాలను పెంచుకోవడానికి గ్రామాల్లో రైతులకు తప్పుడు సమాచారం ఇచ్చి రసాయన ఎరువులను వాడేలా ప్రోత్సహిస్తున్నారని, వాటి బారిన పడకుండా రైతులు జాగ్రత్త పడాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలు వారివారి ఆహార అలవాట్లను మార్చుకున్నారని, ఫలితంగా ఉద్యాన పంటలకు ప్రోత్సాహం పెరిగిందన్నారు. ఉద్యాన పంటలను పూర్తిగా సేంద్రీయ పద్ధతులతో సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. వీటితో పాటు పాడి, మత్స్య పరిశ్రమలపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా తొలుత ఆర్గానిక్ కల్టివేషన్‌పై తయారు చేసిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ ఉద్యాన రైతులకు బహుమతులు అందజేశారు. వీరిలో కడియానికి చెందిన పల్లా వెంకటేశ్వరరావు, డి.వెంకటేశ్వరరావు, కడియపులంక పుల్లా వీరవెంకట్రావులకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతిని అందజేశారు. స్టాల్స్‌లో ఉత్తమ సేంద్రియ ఉత్పత్తులు ఏర్పాటు చేసిన వారిలో ఐ.రాజేష్, ఆరుమళ్ల సాంబిరెడ్డి, కె.కృష్ణమనాయుడులకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని, కలెక్టర్ లక్ష్మికాంతం, మేయర్ కోనేరు శ్రీధర్, ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, మహిళా కమిషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ అనురాధ, సీఐఏ జేఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐఏ కన్వీనర్ జి.వెంకటేశ్వరరావు, జ్యోతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌కు
# సహకరిస్తాం



- చైనాకు షాక్..
- ఇండియాకే జపాన్ సపోర్ట్
- చైనాతోనూ సరిహద్దు వివాదాలే
- జపాన్ అంబాసిడర్ కెంజీ హిరమత్సు

టోక్యో: చైనాతో ఏర్పడిన డోక్లామ్ వివాదంలో జపాన్ కూడా ఇండియాకే మద్దతిచ్చింది. బలప్రయోగంతో ఏకపక్షంగా యథాతథ స్థితిని మార్చడం సరికాదని జపాన్ అభిప్రాయపడింది. ఇప్పటికే అమెరికా కూడా ఈ విషయంలో భారత్‌కు మద్దతిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు జపాన్ కూడా భారత్ వైపు నిలవడంతో చైనా మరిన్ని చిక్కుల్లో పడింది. వచ్చే నెలలో జపాన్ ప్రధాని షింజో అబె భారత్ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆ దేశం భారత్‌కు మద్దతు పలకడం గమనార్హం. డోక్లామ్ ప్రాంతం చైనా, భూటాన్ మధ్య వివాదాస్పదంగా ఉందని మాకు తెలుసు. ఆ రెండు దేశాలు కూడా వివాదం ఉందని అంగీకరించాయి అని జపాన్ అంబాసిడర్ కెంజీ హిరమత్సు అన్నారు.

ఇలాంటి వివాదాస్పద ప్రాంతంలో ఒక దేశం ఏకపక్షంగా బలప్రయోగంతో యథాతథ స్థితిని మార్చాలని చూడటం సరికాదు. చర్చల ద్వారా శాంతియుత మార్గంలో సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించాలి అని ఆయన స్పష్టంచేశారు. మొత్తం ఆసియా ప్రాంతాన్ని ప్రభావితం చేసే ఈ అంశాన్ని తరువాయి 2లో



## కార్తి చిదంబరానికి
# సుప్రీంలో ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం ఈ నెల 23న సీబీఐ ఎదుట హాజరు కావాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో తనను అనవసరంగా ఇరికించారని కార్తి చేసిన వాదనను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అభివృద్ధి మండలి (ఎఫ్ఐపీబీ) అనుమతుల పేరుతో తనను వేధిస్తున్నారని, కానీ వారి అసలు లక్ష్యం తన తండ్రి, కాంగ్రెస్ సీనియర్ తరువాయి 2లో



# వరదలతో నాలుగు రాష్ట్రాల్లో 91 మంది మృతి

- రైల్వే ట్రాక్‌లపై వరద నీరు
- ఆగిన 39 రైళ్లు
- 2.14 లక్షల మంది శరణార్థులు

పాట్నా/ గువాహటి/ లక్నో/ భువనేశ్వర్: బీహార్, అసోం, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పోటెత్తిన వరదలతో గురువారం ఒక్కరోజే 91 మంది మ ృతి చెందారు. బీహార్‌లో గత 24 గంటల్లో 47 మంది మరణించగా ఆ రాష్ట్రంలో ఇప్పటివరకు చనిపోయిన వారి సంఖ్య 119కి చేరుకున్నది. 15 తరువాయి 2లో

# 8 గంటల పని విధానం అమలు చేయాలి





### ఏఐజీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు

కాళేశ్వరరావు మార్కెట్: గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని విధానం అమలుతో పాటు పింఛను సదుపాయం కల్పించాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా తరువాయి 2లో

## చట్టప్రకారమే
# వ్యవహరిస్తున్నాం

### ఆ నటులు గురించి ఇప్పుడేం చెప్పలేం



హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసుల దర్యాప్తు చురుగ్గా సాగుతోందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ వెల్లడించారు. ఎన్‌సీబీ అధికారులు, న్యాయనిపుణులతో చర్చించి ఆధారాలు సేకరిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు సిట్ 11 కేసుల్లో 22 మందిని అరెస్టు చేసిందని స్పష్టం చేశారు. సాక్షుల విచారణ ఇంకా కొనసాగుతోందన్నారు. డ్రగ్స్ కేసులో ఇప్పటికే విచారించిన సినీ ప్రముఖులు సాక్షులా, నిందితులా అనేది ఇప్పుడే చెప్పలేమని, వారి విషయంలో చట్ట ప్రకారమే తరువాయి 2లో

## పాడితో
# అన్నదాతను ఆదుకుందాం

అనంతపురం: జిల్లాలో వర్షాభావాన్ని అధిగమించే ప్రత్యామ్నాయ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. మంత్రి నివాసంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.వేరుసెనగ సాగుకు ఇప్పటికే అదును, పదును పోవడంతో ఇక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను ఉచితంగా అందజేస్తామన్నారు.జిల్లాలోని ప్రతి పంచాయతీలో కనీసం ఐదు ఎకరాల్లో పశుగ్రాస కేంద్రాలు వంతున, 5700 ఎకరాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటుకు, 960 ఎకరాల్లో సాగు చేయడానికి పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చామని చెప్పారు. మరో 900ఎకరాల్లో అనుమతి ఉత్తర్వులు ఇస్తామన్నారు. దీని వల్ల పశువులు అమ్ముకోకుండా రైతును ఆదుకోవచ్చన్నారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శ్రీరామమూర్తి,డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.







### టేకిట్-ఈజీ



వాళ్లు హీరోలో.. జీరోలో.. ఇప్పుడేం తేల్చలేమని అంటున్నారు!!

# నేరరహిత నగరంగా తీర్చిదిద్దుతాం

### పోలీసులకు ప్రజల సహకారం అవసరం .. సీపీ గౌతమ్ సవాంగ్




బెంజిసర్కిల్: రాజధాని అమరావతిలో విజయవాడను సురక్షిత, నేరరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, దీనికి ప్రజల సహకారం కూడా కావాలని నగర పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ పేర్కొన్నారు. విజయవాడ పోలీసు శాఖ, వాసవ్య మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ, డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో యాక్సిస్‌బ్యాంకు సహకారంతో ఆత్మరక్షణ, జీవన నైపుణ్యాలు, విలువలతో కూడిన విద్య అంశాలపై మహిళా మిత్ర సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని బెంజిర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలిలో నిర్వహించారు. కార్యక్రమాన్ని కమిషనర్ గౌతమ్ సవాంగ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రజలు, పోలీసుల కలిసి ఉద్యమించాలని, సమాజంలో మహిళా తరువాయి 2లో

# కౌమారదశలోని బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించండి



## జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు

నెల్లూరు : ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతిగృహాల్లో చదువుతున్న కౌమారదశలోని బాలికలకు వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు వారికి వివిధ పోటీ పరీక్షల గురించి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు సూచించారు. వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించే అంశాలపైనా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి చైతన్యం తీసుకురావాలని కోరారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో కలెక్టరు సమీక్షించారు. బాలికల వ్యక్తిగత ఆరోగ్యం, వారి భద్రత తదితర విషయాలపై అధికారుల అభిప్రాయాలు స్వీకరించారు. ముందుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్ఛార్జి అధికారిణి ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాలలో ఉన్న బాలికలకు ఆరోగ్యం, సమష్టి ఆహారం, వ్యక్తిగత ఆరోగ్యం, ఆత్మరక్షణపై వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దానికోసం రీసోర్స్ పర్సన్స్‌ను ఎంపిక చేసి, వారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తే ఫలితాలుంటాయని సూచించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ కౌమారదశ బాలికలకు నిర్దేశించిన లక్ష్యాలపై అవగాహన కల్పించడానికి సమగ్రమైన పుస్తకాన్ని ముద్రించాలని అధికారులకు సూచించారు. ఆయా పుస్తకాలను సంబంధిత మహిళా ఉపాధ్యాయులకు ఇచ్చి వారికి బోధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రిసోర్స్ పర్సన్స్ గుర్తించడంతోపాటు వారికి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటుచేసి ఒక పద్ధతి ప్రకారం కౌమారదశలో వసతి గృహాలలో ఉన్న బాలికలకు పేర్కొన్న అంశాలలో సాధికారత పెంపొందించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టరు-2 వెంకటసుబ్బారెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వరసుందరం, డీఈవో మువ్వా రామ లింగం, రాజీవ్ విద్యామిషన్ పీవో రమణ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్‌రావు, ఐటీడీఏ పీవో కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు తీగలు తగిలి వ్యక్తి మృతి

పుల్లలచెరువు: విద్యుత్తు తీగలు తగిలి లారీ క్లీనర్ మల్లికార్జున(30) మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన పుల్లలచెరువు విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది.

లారీ డ్రైవర్, స్థానికుల కథనం ప్రకారం.. పుల్లలచెరువులోని ఓ ఇంటి నిర్మాణం కోసం రాళ్ల లోడుతో లారీ గుంటూరు జిల్లా మాచర్ల నుంచి పుల్లలచెరువుకు చేరుకుంది. ఈ క్రమంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలో గల ఇంటి వద్ద రాళ్లను దింపేందుకు ప్రయత్నిస్తుండగా కేబుల్ వైర్ అడ్డు తగిలింది. దీంతో దానిని తప్పించేందుకు క్లీనర్ లారీపైకి వెళ్లాడు. అంతలోనే పైన ఉన్న విద్యుత్తు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు లారీ డ్రైవర్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు నాగార్జునసాగర్‌కు చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా ధ్వజప్రతిష్ట



మహానంది : మహానంది పుణ్యక్షేత్రంలో అంతర్భాగంగా గంగానంది దివ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న గరుడనందీశ్వర ఆలయం ఎదుట ధ్వజప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది.

ఈ సందర్భంగా చతుర్ధకాల పూజ, హెూమాలు, యంత్రస్థాపన, ధ్వజ శిఖర ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట కలన్యాసము, మహా పూర్ణా హుతి, కలశ ఉద్వాసన, సదస్యము, వేదాశీ ర్వచనము, అన్నదాన తదితర కార్య క్రమాలు నిర్వహించారు. వేద పండితులు వైద్యనాథ శివాచార్య, రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, జ్వాలా చక్రవర్తి శర్మ, ఆలయ అర్చకులు శంకరయ్యల ఆధ్వర్యంలో...

ఆయా పూజలు పూర్తయ్యాయి.

దాతలు భగద్దత్తు, శ్రీవాణి దంపతులు, దేవస్థానం విశ్రాంత పర్యవేక్షకురాలు సీతారత్న కుమారి, పాలకమండలి ఛైర్మన్ పాణ్యం ప్రసాదరావు, ఈవో చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల ఆదాయం మెరుగుపై ప్రత్యేక దృష్టి

- రూ.150 కోట్ల పెట్టుబడులతో 47 కొత్త పథకాలు
- ఈ ఏడాది అమలుకు ప్రభుత్వ నిర్ణయం

రాయగడ : దేశానికి వెన్నుముకగా నిలుస్తున్న అన్నదాతల ఆదాయ వనరులు మెరుగుపరిచేందుకు నవీన్ సర్కార్ ప్రయత్నిస్తోంది. రూ.150 కోట్ల అదనపు పెట్టుబడులతో 47 కొత్త ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర?యించింది.

వ్యవసాయం, ఆహార ఉత్పత్తి, ఇతర అనుబంధ రంగాల్లో వీటి నిర్వహణకు పూనుకుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవివై) కింద ఈ కొత్త పథకాలు అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

కొత్త పథకాలివే..

భూసార పరీక్ష మినీ కేంద్రాల స్థాపన, వర్షాధార పంటలకు ప్రత్యామ్నాయ విత్తనాలు, బంగాళా దుంపల ప్రోత్సాహక పథకం కింద శీతల గిడ్డంగులు, చెరువులు అభివృద్ధి, ప్రత్యేక రకం చేపల సాగు తదితర వాటితోపాటు పంట బీమా, సాంకేతిక పరిజ్ఞాన మెరుగు, విత్తన పరీక్ష కేంద్రం నవీకరణ, కూరగాయల సాగు నిర్వహణ వంటి వాటికి ఈ పథకాల కింద అమలు చేయనున్నట్లు సర్కార్ చెప్పింది.

379 ప్రాజెక్టుల పూర్తి

రాష్ట్రంలో 2007-08 నుంచి అమలవుతున్న ఆర్‌కేవివై కింద ఇప్పటి వరకూ 615 మేజర్ పథకాలను ఒడిశా సర్కార్ రూపొందించగా వీటిలో 379 పూర్తి కాగా మిగతావి వివిధ దశల్లో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆర్‌కేవివై కింద కేంద్రం 60 శాతం మేర రూ.205 కోట్ల ఆర్థిక సాయమందించగా, మిగతా 40 శాతం వాటా నిధులను(రూ.136.79 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## సెప్టెంబరు 7 నుంచి శాసనసభ వర్షాకాల సమావేశాలు

భువనేశ్వర్ : సెప్టెంబరు 7వ తేదీ నుంచి శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అదే నెల 16 వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు పోగా ఈ సమావేశాల్లో ఎనిమిది రోజులు చర్చలు జరుగుతాయి.రాష్ట్రంలో మంత్రివర్గం మార్పు అనంతరం ఇదే తొలి సమావేశం కావడం విశేషం

# బోరు బావులను మూయించాలి

పగిడ్యాల: మండలంలోని అన్ని గ్రామాల పొలాల్లో వేసిన బోరుబావులను రైతులు రక్షణ లేకుండా వదిలేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల వీఆర్వోలు విధిగా పొలాల్లో పర్యటించి బోరుబావులను గుర్తించి వెంటనే మూయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు మూయకపోతే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక నుంచి పొలాల్లో బోర్లు వేయాలనుకుంటే రైతులు విధిగా రెవెన్యూ అనుమతి పొందాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ పద్మావతి, ఆర్ఐ కళావతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల నిరసన ప్రదర్శన

నెల్లూరు: తపాలా శాఖలో పనిచేస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత గ్రామీణ డాక్ సేవక్స్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా రెండో రోజు నెల్లూరు ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట అర్ధ నగ్న ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ నెల్లూరు డివిజన్ కార్యదర్శి ఎమ్‌డి. ఇస్మాయిల్ మాట్లాడుతూ కమలేష్ చంద్ర వేతన కమిటిలోని సానుకూల సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. ఈసమ్మెలో అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నెల్లూరు డివిజన్ కార్యదర్శి దుడ్డు రమేష్‌బాబు, ఏఐజీడీఎస్ సంఘ నాయకులు ఆర్. సతీష్, కార్య నిర్వాహక కార్యదర్శి టి. వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకుల సంక్షేమానికి కృషి

గోస్పాడు: గోస్పాడు మండలం యాలూరులో శుక్రవారం వాల్మీకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు, వాల్మికి రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు బిటి నాయుడు, ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

## నీట్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదు

### ఉప్పాళం ఎమ్మెల్యే అన్బళగన్

పుదుచ్చేరి : నీట్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నాడీఎంకే (అమ్మ) ఎమ్మెల్యే ఎ.అన్బళగన్ విమర్శించారు. నీట్ నుంచి మినహాయించాలని తమిళనాడు ప్రభుత్వం స్పష్టమైన ఆలోచనతో ఆర్డినెన్స్ జారీ చేసిందని, పుదుచ్చేరి ప్రభుత్వం మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మినహాయింపు పొందేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వం అంటున్న నేపథ్యంలో అదే కనుక జరిగితే నీట్ మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్ జరిగితే విద్యార్థుల పరిస్థితి ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి నారాయణ స్వామి రెండు విధాలుగా వ్యవరిస్తూ విద్యార్థులను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. కౌన్సెలింగ్‌ను నిర్వ హించే సెంట్రలయిజ్డ్ అడ్మిషన్ కమిటీ అధికారులకు కూడా స్పష్టత లేకపోవడం శోచనీయమన్నారు.

## ఏకరూప విద్యావిధానమే ఉత్తమం

బెంగళూరు : రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఏకరూప విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేస్తూ గురువారం బెంగళూరు స్వతంత్ర ఉద్యానవనంలో కర్ణాటక విద్యార్థి, తల్లిదండ్రుల జాగృతి వేదిక కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఎక్కువ రుసుము వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలపై కేసులు దాఖలు చేయాలని ఆందోళనకారులు పట్టుపట్టారు. ఏకరూప విధానం అమలులోకి తీసుకురాకపోతే పేదలకు విద్య అందని పండులా మారిపోతుందని రిపబ్లికసేన అధ్యక్షుడు జిగణి శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవేశాల ప్రక్రియ పారంభంలో రుసుముల వివరాల్ని పాఠశాల వద్ద ప్రదర్శించాలనే ఆదేశాలునాన దాన్ని ఎవరూ అమలు చేయడం లేదని తప్పుపట్టారు. ఇష్ట మొచ్చినట్లుగా పుస్తకాలు, దుస్తుల పేరుతో ఎక్కువ నగదు గుంజుతున్నారని, దోపిడీ నియంత్రిం చేందుకు కఠిన నిబంధనలు అవసరమని సూచించారు.

# ప్రభుత్వ పథకాలపై అవగాహన



కాశీనగర్ : ప్రభుత్వ పథకాలపై మహిళలు చైతన్యం కావాలని జిల్లా లీగల్ హియర్ కమిషనర్ ప్రజ్యోతి రౌత్ అన్నారు. సమితి సమావేశ భవనంలో జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీడీఓ మనోరంజన్ సాహు అధ్యక్షతన జరిగింది. మమతా, బిజు కృషక్ కల్యాణ్ యోజన, ఆహార్, మహాప్రమాణ్, హరిశ్చంద్ర సహాయత, బిజు కన్యారత్న యోజన, బిజు నిజుక్తి యోజన, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పనులు, ప్రధానమంత్రి అవాస్ యోజన తదితర పథకాలపై మహిళలను చైతన్యపరిచారు. బీడీఓ మాట్లాడుతూ ప్రతీ ఒక అర్హునికి ప్రభుత్వ పథకాలు అందేలా మీరంతా సహకరించాలని మహిళలను ఉద్దేశించి అన్నారు. అవగాహన సదస్సులో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా వార్డు సభ్యులు, సర్పంచులు, సమితి సభ్యులు, మహిళా గ్రూపులు, మహిళలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## కార్తీ చిదంబరానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

నేత, కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరమని కార్తి చేసిన వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆయన తరపు న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం తన వాదనలో ప్రధాన రాజకీయ నేతల బంధువులను లక్ష్యంగా చేసుకోవడం ఫ్యాషన్‌గా మారిందని పేర్కొన్నారు.

తాను అమాయకుడినంటూ కార్తి చేస్తున్న వాదనలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జే ఎస్ ఖేహర్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. సీబీఐ ఎదుట హాజరుకానక్కర్లేనంత మంచివాడినని చెప్పాలనుకుంటున్నారా? అని నిలదీసింది. దీనిపై కార్తి స్పందిస్తూ సీబీఐ ఎదుట హాజరు కావడంపై తనకు భయం లేదని, అయితే తనకు రక్షణ కావాలని కోరారు.

సుప్రీంకోర్టు స్పందిస్తూ సీబీఐ ఎదుట హాజరయ్యేటపుడు న్యాయవాదిని తీసుకెళ్ళవచ్చునని కార్తికి అనుమతి ఇచ్చింది. అయితే విచారణ సమయంలో వినికిడి దూరంలో న్యాయవాదిని ఉంచుకోకూడదని స్పష్టం చేసింది.

23న సీబీఐ ఎదుటకు కార్తీ చిదంబరం

అవినీతి, ఫెరా ఉల్లంఘనల కేసుకు సంబంధించి ఈ నెల 23న సీబీఐ ఎదుట విచారణకు హాజరు కావాలని మాజీ కేంద్ర మంత్రి పీ చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. తన తండ్రి, కాంగ్రెస్ నేత చిదంబరంను టార్గెట్ చేసిన ప్రభుత్వం కేసుల పేరుతో తనను వేధింపులకు గురిచేస్తున్నదని కార్తీ చేసిన ఆరోపణలను కోర్టు తోసిపుచ్చింది. ప్రముఖ రాజకీయ నేతలను టార్గెట్ చేయడం ఫ్యాషన్‌గా మారిందని కార్తీ న్యాయవాది గోపాల్ సుబ్రమణియన్ వాదించారు. కార్తీ తన వాదనలను సమర్థించుకుంటున్న క్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహార్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన సుప్రీం బెంచ్ జోక్యం చేసుకుంది.

'మీరు చాలా మంచివారు కాబట్టి మీరు సీబీఐ ఎదుట హాజరుకానని చెప్పదలుచుకున్నారా' అని బెంచ్ కార్తీ చిదంబరాన్ని ప్రశ్నించింది. సీబీఐ ఎదుట హాజరయ్యేందుకు తాను భయపడటం లేదని..అయితే తనకు భద్రత కావాలని కార్తీ చిదంబరం ఈ సందర్భంగా కోర్టును కోరారు. న్యాయవాదితో కలిసి సీబీఐ ఎదుట హాజరయ్యేందుకు కోర్టు అనుమతించింది. అయితే విచారణ సమయంలో న్యాయవాది దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. మరోవైపు కార్తీ లుక్ అవుట్ నోటీసుపై మద్రాస్ హైకోర్టు జారీ చేసిన స్టే ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

## భారత్‌కు సహకరిస్తాం

జపాన్ నిశితంగా పరిశీలిస్తున్నదని హిరమత్సు తెలిపారు. ఇక ఈ అంశంలో ఇండియా పాత్రపై కూడా ఆయన స్పందించారు. భూటాన్‌తో ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాల కారణంగా భారత్ ఈ విషయంలో జోక్యం చేసుకున్నదని మాకు అర్థమైంది. దౌత్య మార్గాల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూస్తామని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ చెబుతూనే ఉన్నారు. ఇదే సరైన వైఖరి అని మేం కూడా భావిస్తున్నాం అని హిరమత్సు చెప్పారు. డోక్లామ్‌లో రెండు నెలలుగా ఇండియా, చైనా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే.

సెప్టెంబరు 13 నుంచి మూడు రోజులపాటు జపాన్ ప్రధాని షింజో అబే భారత్‌లో పర్యటించనున్నారు. ఆ సమయంలోనే ఆయన అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటిస్తారని కెన్జీ తెలిపారు. డోక్లాం విషయంలో చైనా దూకుడుగా వ్యవహరించి భారత్‌పై ఒత్తిడి చేస్తే మేం రంగంలోకి దిగుతామని చెప్పారు. భారత్‌లాగే జపాన్‌కి కూడా చైనాతో సరిహద్దు వివాదాలున్నాయి.

## వరదలతో నాలుగు రాష్ట్రాల్లో 91 మంది మృతి

జిల్లాల పరిధిలో 93 లక్షల మంది ఇబ్బందుల పాలయ్యారు. తూర్పు మధ్య రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్‌లపై నీళ్లు నిలువడంతో 39 రైళ్లు రద్దు చేశారు. 504 సహాయ శిబిరాల్లో 2.14 లక్షల మంది తల దాచుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని ఆరు ఉత్తర జిల్లాల్లో వరదలు తగ్గుముఖం పట్టినా గత 24 గంటల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు.

వారిలో 15 మంది నీట మునిగి, మరో ఇద్దరు పాము కాటుకు గురై మరణించారు. బెంగాల్‌లోని ఉత్తర ప్రాంతం, అసోం రాష్ట్రాల పరిధిలో వరుసగా ఐదో రోజు కూడా రైలు సర్వీసులు రద్దు చేశారు. అసోంలోని 24 జిల్లాల పరిధిలో 2584 గ్రామాలు వరద నీటిలోనే మగ్గుతున్నాయి. తాజాగా పది మంది మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 133కి చేరుకున్నది. ఇప్పటికీ 21 జిల్లాల పరిధిలో 602 సహాయ శిబిరాల్లో 1,01, 035 మంది తలదాచుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో మూడురోజుల్లో 17మంది మృతి చెందారు. ఒడిశాలో వచ్చే 24 గంటల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది.

## చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నాం

వ్యవహరిస్తున్నామని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి కోర్టులో ఛార్జిషీట్లు దాఖలు చేస్తామని అకున్ తెలిపారు. ఫోరెన్సిక్ నివేదికల కోసం ఎదురు చేస్తున్నట్టు చెప్పారు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని, సిట్ చేస్తోన్న దర్యాప్తునకు ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తోందని అన్నారు. పాఠశాలల్లో గురువులు విద్యార్థుల ప్రవర్తనను గమనించాలని సూచించారు. ఇప్పటివరకు విద్యార్థులు ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని స్పష్టంచేశారు. సామాజిక బాధ్యతతోనే డ్రగ్స్ దుష్పరిణామాలను ప్రజలకు వివరిస్తున్నామని, డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు విద్యా సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయని అన్నారు.

## 8 గంటల పని విధానం అమలు చేయాలి

ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి. రఘుబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం (ఎపీజీడీఎస్) ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. అందులో భాగంగా విజయవాడ డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగులు పాతబస్తీలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగుల పరిస్థితి, వేతనాల కోసం వేసిన కమలేష్ చంద్ర కమిటీ గత ఏడాది నవంబర్ 24న నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. ఆ నివేదికలో సవరణలు చేయాలని ఉద్యోగుల కోరగా.. ఆమోదించిన ప్రభుత్వం నేటికీ కమిటీ సిఫార్సులు అమలు చేయడం లేదన్నారు. సమ్మెలోకి వెళతామని నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యోగులు సమ్మెబాట పట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను మరింత తీవ్రం చేస్తామన్నారు. సంఘం నాయకులు బెవర వెంకటేశ్వరరావు, కె. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేరరహిత నగరంగా తీర్చిదిద్దుతాం

సమస్యలపై పోరాడాలన్నారు. ప్రజల సహకారం లేకపోతే పోలీసులు ఏమీ చేయలేరని, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ముందుకు రావడంలేదని, న్యాయం జరుగుతుందా లేదా అనే సందేహంతో పోలీసుల ముందుకు రాకుండా భరిస్తున్నారని చెప్పారు. మహిళా సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సమానత్వం కోసం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా మిత్రను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా సమాజంలో పిల్లలు, వృద్ధులు, మహిళల గురించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో మహిళా మిత్ర, వృద్ధ మిత్ర, బాలమిత్ర ద్వారా పలు కార్యక్రమాలను అమలు చేస్తూ సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు ముందుకు వెళ్తున్నామన్నారు. జాయింట్ పోలీస్ కమిషనర్ బీవీ రమణకుమార్ మాట్లాడుతూ తమకు వస్తున్న ఫిర్యాదుల్లో 50 శాతం మహిళల సమస్యలకు సంబంధించినవే ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డీసీపీ క్రాంతి రాణా మాట్లాడుతూ ఏ కార్యక్రమం చేపట్టినా, దానిపై నిరంతర పర్యవేక్షణ ఉంటేనే విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య మాట్లాడుతూ తొలి విడతలో పది పోలీస్ స్టేషన్ల పరిధిలోని మహిళా మిత్ర కో-ఆర్డినేటర్లుకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని, తరువాత మిగిలిన వారికి ఇస్తామని చెప్పారు. విజయవాడను నేరరహితం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం మహిళల ఆత్మరక్షణ, జీవన నైపుణ్యాలు, విద్య విలువలు అంశంపై రూపొందించిన పుస్తకాన్ని కమిషనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆత్మరక్షణ పద్ధతులను శిక్షకురాలు లక్ష్మీ చేసి చూపించారు. కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధి రామకృష్ణ, ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా ఛైర్మన్ శ్రీదేవి, ఇన్నర్ వీల్ క్లబ్ విజయవాడ కార్యదర్శి జి.రశ్మి, ఏసీపీలు సత్యానందం, శ్రీనివాస్, రామకృష్ణ, విజయభాస్కర్, శిక్షకులు వి.లక్ష్మి, వీవీ నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక పోటీలకు గడువు తేదీ 24

నెల్లూరు : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యాటకశాఖ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషియన్ ఆధ్వర్యంలో పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ పెయింటింగ్, క్విజ్, ఫోటోగ్రఫి అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐహెచ్ఐ ప్రిన్సిపల్ కె.శివరామకృష్ణ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు తమ పేర్లను ఈనెల 24వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 97013 43045, 9701343046 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

## నేరుగా పీజీ ప్రవేశాలు కల్పించాలి

కర్నూలు : రాయలసీమ విశ్వవిద్యాలయ ఆవరణలోని పీజీ కోర్సుల స్పాట్ ప్రవేశాలకు మంత్రణం జరిగింది. స్థానిక వెబ్ కౌన్సిలింగ్ భవనంలో నిర్వహించిన మంత్రణానికి విద్యార్థుల నుంచి స్పందన వచ్చింది. గతంలో భర్తీకాని సీట్లకు కన్వీనర్ సీవీ కృష్ణారెడ్డి సమక్షంలో నేరుగా ప్రవేశాలు కల్పించారు. నిర్దేశించిన సమయానికి వచ్చిన విద్యార్థులకు ర్యాంకుల వారీగా సీట్ల కేటాయింపు పూర్తి చేశారు. భర్తీ కాని సీట్లకు పీజీసెట్‌కు హాజరుకాని విద్యార్థులకు నేరుగా అవకాశం కల్పించాలని ఆయా విద్యార్థి నాయకులు సురేష్, రాఘవేంద్ర, శ్రీరాములు ఆధ్వర్యంలో కన్వీనర్‌కు వినతిపత్రం అందజేశారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

# జగన్ ఆస్తుల వివరాలు వెల్లడించాలి



కర్నూలు : నైతిక విలువలు, విశ్వసనీయత, అవినీతి, న్యాయాన్యాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైకాపా అధినేత జగన్‌కు లేదని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌ను ఆదర్శంగా తీసుకోమని స్వయాన ఆయన తల్లి విజయమ్మ, సతీమణి భారతి కూడా చెప్పలేరని.. ఆయన అల్లరి, ఆకతాయి చేష్టలు, ఆరాచకాలు అదంరికీ తెలుసన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోమని తాము గర్వంగా ప్రతిఒక్కరికి చెప్పగలమని, ఆయన జీవితం తెరిచిన పుస్తకమన్నారు. జగన్ గొంతెమ్మ కోర్కెలు చూసి ఆయన రాజకీయ సలహాదారు ప్రశాంత్ కిషోర్ మూటాముల్లె సర్దుకుని మధ్యలోనే పలాయనం చిత్తగించారని ఎద్దేవా చేశారు. వైఎస్ సీఎం అయ్యే వరకు సొంతిల్లు కూడా లేని జగన్ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని వూరికో విలాసవంతమైన భవంతులు కట్టుకున్నారని ఆరోపించారు. ఉప ఎన్నికల ప్రచారంలో ప్రగల్భాలు పలుకుతూ విమర్శలు చేస్తున్న జగన్ ఆయన ఆస్తులను ఇంతవరకు ఎందుకు ప్రకటించలేదని రామయ్య ప్రశ్నించారు. అక్రమార్జన కాబట్టే ఆయన ఆస్తుల లెక్క అయనకే తెలియడం లేదన్నారు. ధైర్యం ఉంటే జగన్ తన ఆస్తులు వివరాలను ఎన్నికల ప్రచారంలో ప్రకటించాలని సవాలు విసిరారు. తల్లిదండ్రులను కోల్పోయి అన్న విజయం కోసం కాళ్లు అరిగేలా తిరుగుతూ ఆహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి అఖిలప్రియను వైకాపా నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం శోచనీయమన్నారు. సంప్రదాయ దుస్తుల్లో భాగమైన చుడీదార్లను సైతం వైకాపా శాసనసభ్యురాలు రోజా ఎగతాళి చేయటం ఆమె విజ్ఞతకే వదిలివేస్తున్నట్లు రామయ్య అన్నారు. నంద్యాల ఉపఎన్నికలో రోజాకు మంచి కంచిపట్టు చీర కట్టించి గడప గడపకు తిప్పి మహిళలకు బొట్టు పెట్టించాలని తాము వైకాపా అధినేత జగన్‌ను కోరుతున్నామని, రోజా ఇంటింటికి తిరగడంతో తెదేపా అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అల్లాబకాష్, నంద్యాల నాగేంద్ర, బాబురాజ్, మహేష్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఒంగోలు : జిల్లాపరిషత్ నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అభివ ృద్ధి పనులను వేగవంతం చేయాలని జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు అధికారులకు సూచించారు. ఒంగోలులోని పాత జిల్లాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలోని ఎంపీడీవో, పంచాయితీ రాజ్, ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీలోపు జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రహరీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో సాయికుమారి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖరయ్య, ఏవో వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

## వైకాపాకు ఓటమి భయం

**మంత్రి శిద్దా రాఘవరావు**

చాగలమర్రి : వైకాపా ఓడిపోతుందనే భయంతోనే ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గల్లీలు పట్టుకుని తిరుగుతున్నారని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు విమర్శించారు. నంద్యాలలోని 10వ వార్డులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే ప్రతిపక్ష హోదాలో ఉంటూ గల్లీ గల్లీ తిరుగుతున్నారని, దిక్కు తోచక ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఆరోపించారు. నంద్యాల రూపురేఖలు మారాలంటే తెదేపా విజయం తప్పనిసరి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే నంద్యాల అభివృద్ధికి దాదాపు రూ.1300 కోట్లు కేటాయించారని తెలిపారు. సీమ జిల్లాలపై చంద్రబాబుకు ప్రేమ లేదని విమర్శిస్తున్నారని, ఈ జిల్లాల్లో జరుగు తున్న అభివ ృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాకు కియా కార్ల పరిశ్రమ, నెల్లూరులో మొబైల్, తిరుపతి, కర్నూలులో డిఫెన్స్ మానిఫ్యాక్టరింగ్‌లను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

నంద్యాల ఉప ఎన్నికల్లో మైనార్టీలు, వైశ్య, కాపు, ఎస్సీ, ఎస్టీలు పూర్తి స్థాయిలో తెదేపాకు మద్దతు తెలుపుతున్నారని, తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి 25 వేల మెజార్టీతో గెలుస్తారని ఆయన తెలిపారు.

## పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

### ఏపీఎస్‌ఆర్టీసీ సన్నాహాలు

ఒంగోలు : సెప్టెంబరులో జరగనున్న కావేరీ పుష్కరాలకు ప్రకాశం జిల్లా ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నాహాలు ప్రారంభించింది. తమిళనాడు-కర్ణాటక సరిహద్దులోని కావేరీ నదీ తీరంలో సెప్టెంబరు 12 నుంచి 24 వరకు ఈ పుష్కరాలు జరగనున్నాయి. రిజర్వేషన్ సౌకర్యంతో పాటు ప్రయాణికులు కోరితే అద్దెకు బస్సులు అందజేస్తామని ఆర్టీసీ ప్రాంతీయ ఉన్నతాధికారులు తెలిపారు.

కావేరీ పుష్కరాలకు సంబంధించి ఏ డిపో నుంచి ఎన్ని ప్రత్యేక బస్సులు కేటయించేది త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు వెల్లడించారు.

తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, షిరిడి తదితర పుణ్యక్షేత్రాలు, పాపికొండలు, వూటి, కొడ్కెకెనల్, హైదరాబాద్, శ్రీహరికోట లాంటి పర్యాటక ప్రాంతాలకూ బస్సులను కేటాయిస్తామని అధికారులు తెలిపారు.

## 20 కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు :ఈనెల 20న జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ మైదానంలో జూనియర్స్ అండర్-19 బాలబాలికల జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు బాలబాలికల విభాగంలో 23.12.1998 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. బాలురు 70 కేజీల, బాలికల 65 కేజీల లోపు బరువు కలిగిన వారు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 29 వరకు పాణ్యంలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు వయోధ్రువపత్రం, ఆధార్ కార్డుతో నేరుగా రావాలని కోరారు. వివరాలకు 90306 46465 చరవాణిలో సంప్రదించాలని కోరారు.

**సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు** : ఈనెల 20న జిల్లా క్రీడాపాధికారిక సంస్థ మైదానంలో సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ గౌడ్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఆసక్తిగల క్రీడాకారులు నాలుగు పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోలు, వయోధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 90102 23974 చరవాణిలో సంప్రదించాలని కోరారు.

## ఘనవ్యర్థాల నిర్వహణతో సంపద సృష్టి : జడ్పీ సీఈవో



వింజమూరు : ఘన వ్యర్థాల నిర్వహణతో పంచాయతీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతోపాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చని జడ్పీ సీఈవో వసుమతి అన్నారు. వింజమూరు బైపాస్ రోడ్డులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద వింజమూరు, సీతారామపురం మండలాల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అందరూ కలసి పనిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. వింజమూరు కేంద్రం ఆదర్శంగా ఉందని, మిగిలిన పంచాయతీలు కూడా ఇదే తరహాలో కేంద్రాలను తయారు చేయాలన్నారు.

డీపీవో శ్రీహరి మాట్లాడుతూ అక్టోబరు 2 నాటికి జిల్లాలోని అన్ని గ్రామాలను చెత్త లేని స్వఛ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు. హరిత రాయబారులతో గ్రామాల్లో ప్రతి ఇంటిలో వంట గది వ్యర్థాలను సేకరించాలన్నారు. మిగిలిన అన్ని రకాల వ్యర్థాల పొడి చెత్త ద్వారా వానపాములతో వర్మికంపోస్ట్‌ను తయారు చేసి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రెండు మండలాల అధికారులకు, ప్రజా ప్రనిధులకు ఘన వ్యర్థాల నిర్వహణ, సంపద సృష్టిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ జిల్లా సమన్వయకర్త సరళ, వింజమూరు ఎంపీపీ గణపం కృష్ణకిరణ్‌రెడ్డి, వింజమూరు, సీతారామపురం మండలాల జడ్పీటీసీ సభ్యులు పులిచర్ల వెంకట నారాయణరెడ్డి, కె.జ్యోతి, వింజమూరు సర్పంచి గణపం బాలకృష్ణారెడ్డి, సీతారామపురం తహసీల్దారు కోటేశ్వరరావు, ఎంపీడీవోలు ప్రత్యూష, కిరణ్‌కుమార్, వ్యవసాయాధికారులు, ఎంఈవోలు, ఏపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీపీడబ్ల్యూ పథకాల నిర్వహణ బాధ్యత కమిటీలదే

### - జడ్పీ అధ్యక్షుడు ఈదర హరిబాబు

ఒంగోలు : జిల్లాలో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాల నిర్వహణ బాధ్యతలను ఇక నుంచి కమిటీలకు అప్పగించనున్నట్లు జడ్పీ అధ్యక్షుడు ఈదర హరిబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఒంగోలు, సంత నూతలపాడు నియోజక వర్గాలకు సంబంధించి సీపీడబ్ల్యూ పథకాల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు సీపీడబ్ల్యూ పథకాల నిర్వహణ గుత్తేదారులు నిర్వహించారు. తాజాగా వచ్చిన జీవోఆర్టీ నంబర్.2290 ప్రకారం పథకాల నిర్వహణకు సంబంధించి కమిటీ అధ్యక్షునిగా జడ్పీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షునిగా మండల జడ్పీటీసీ సభ్యుడు, సభ్యులుగా ఆయా గ్రామాల పంచాయతీ సర్పంచులు, కార్యదర్శిగా కార్యనిర్వాహక ఇంజినీరు ఉంటారని వివరించారు. జనాభా ప్రాతిపదికన ఇక నుంచి గ్రామాలకు నీటి ప్రవాహ మీటర్లు అమర్చి వినియోగాన్ని బట్టి బిల్లులు చెల్లించాలన్నారు. అనంతరం ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోని సీపీడబ్ల్యూ పథకాల నిర్వహణకు సంబంధించి కమిటీలను నియమించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ లతీఫ్, ఏఈ సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

## 29న క్రీడా దినోత్సవ పురస్కారాలు

కర్నూలు : జిల్లా కేంద్రంలో ఆగస్టు 29న క్రీడాదినోత్సవం నిర్వహించనున్నామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన జిల్లా క్రీడాకారులను ఆరోజు సన్మానించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి ్ణ తెలిపారు. వివరాలకు 08518 225419లో సంప్రదించాలని కోరారు.

## కొట్టుకుపోయిన నిర్మాణంలో ఉన్న చెక్‌డ్యాంలు...



మార్కాపురం : మార్కాపురం మండలం ఇడుపూరులో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి నిర్మాణంలో ఉన్న రెండు చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. నీరు- ప్రగతి ద్వారా ఉప్పువాగులో వీటిని నిర్మిస్తున్నారు. సెంట్రింగ్ కర్ర, ఇనుము సగం మేర ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇసుక, కంకర కొట్టుకు పోయింది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం జరిగినట్లు సర్పంచి జవ్వాజి రామాంజులరెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గాక నిర్మాణ పనులు చేపడతామన్నారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

ఎమ్మిగనూరు: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని అగ్నిమాపక అధికారి ముత్తన్నగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో వెంకటాపురం కాలనీలో మహిళలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గృహాలలో గ్యాస్‌ను వినియోగించి వంట చేసే మహిళలు వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. వంటగది చుట్టూ ఉన్న కిటీకీలను తెరిచే ఉంచాలని సూచించారు

## డీటీసీలో కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం

ఒంగోలు : పోలీసు శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే కానిస్టేబుళ్లదే కీలక బాధ్యత అని, క్లిష్టమైన కేసుల ఛేదనలో అత్యంత కీలకమైన సమాచారం వారి ద్వారానే చేరుతుందని జిల్లా ఎస్పీ భూసారపు సత్యఏసుబాబు చెప్పారు. ఒంగోలు డిటీసీలో ఎస్‌సీటీ పోలీసు కానిస్టేబుళ్ల తొమ్మిది నెలల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60 వేల మంది పోలీసు కానిస్టేబుళ్లు ఉన్నారని, శాంతి భద్రతల నిర్వహణలో కీలకమైన పోలీసు కుటుంబంలోకి నూతనంగా ప్రవేశించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావంతో శిక్షణను పూర్తి చేయాలని సూచించారు. పోలీసులు ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా శిక్షణ కేంద్రంలో 233 మందికి తొమ్మిది నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు అదనపు ఎస్పీ (పరిపాలన), డీటీసీ ప్రధానాచార్యులు ఏబీటీఎస్ ఉదయరాణి చెప్పారు. గుంటూరు గ్రామీణ జిల్లా నుంచి 141, విజయవాడ నగరం నుంచి 15, పశ్చిమ గోదావరి నుంచి 77 మంది వచ్చినట్లు చెప్పారు. ఏఎస్పీ(ఏఆర్) టి.శివారెడ్డి, ఒంగోలు డీఎస్పీ గుంటుపల్లి శ్రీనివాసరావు, సీసీఎస్, ట్రాఫిక్, ఏఆర్ డీఎస్పీలు కె.వెంకటేశ్వరరావు, జె.రాంబాబు, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీటీసీని పరిశీలించిన ఎస్పీ

శిక్షణ కార్యక్రమం ప్రారంభించిన అనంతరం ఎస్పీ సత్యఏసుబాబు డీటీసీని పరిశీలించారు. అభ్యర్థులకు కల్పిస్తున్న వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## ఈ నెలాఖరు నుంచి మిర్చి కొనుగోళ్లు

పర్చూరు : పర్చూరు యార్డులో మిరప కొనుగోళ్లను ఈ నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్యచౌదరి, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి ఎం.వరలక్ష్మి తెలిపారు. మిర్చి వ్యాపారులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే లైసెన్సులు మంజూరు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రం పర్చూరు యార్డులో శాశ్వతంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వరలక్ష్మి వెల్లడించారు. మిర్చి వ్యాపారులు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## జిల్లాలో వూపందుకున్న ఖరీఫ్ సాగు

ఒంగోలు : గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగు వూపందుకుంది. పక్షం రోజుల కిందట జిల్లాలో 26 వేల హెక్టార్లు సాగుకాగా- ఇప్పుడు లక్ష హెక్టార్లుకు చేరింది. అత్యధికంగా కంది పంట సాగులోకి వచ్చింది. ఈ సందర్భంగా జేడీఏ మురళీకృష్ణ మాట్లాడారు. ఈ వర్షాల వల్ల పొలాలు బాగా పదునైనట్లు తెలిపారు. సెప్టెంబరు ఆఖరు వరకు కంది, మినుము, అలసంద వేసుకోవచ్చన్నారు. తక్కువ వ్యవధిలో పంట చేతికొచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది పత్తి విస్తీర?ం తగ్గిపోయి, ఆ స్థానంలో పప్పుధాన్యాల పంటలకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. బోరుబావుల కింద మిర్చి, కూరగాయల తోటలు సాగు చేస్తున్నారన్నారు. గతంతో పోల్చితే కూరగాయల సాగు పెరిగినట్లు చెప్పారు. జిల్లాలో కంది సాధారణ విస్తీర?ం 64,544 హెక్టార్లుకాగా- ఇప్పటికే 44,055 హెక్టార్లు, పత్తి 57,969కుగాను 17,553 హెక్టార్లలో సాగయిందని వివరించారు. అదును దాటిపోతున్నందున ఇక పత్తి సాగుకు అవకాశం ఉండదని అన్నారు. ఇకపై పప్పుధాన్య పంటలు వేసేవారు సాళ్ల సంఖ్య తగ్గించి ఎక్కువ విత్తనం ఎదపెట్టాలని సూచించారు. వ్యవసాయ అధికారులు సూచించే యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

# 2018లో వెలుగొండ ప్రాజెక్టుకు నీరు

### కంభం చెరువును పరిశీలించిన కలెక్టర్

బేస్తవారపేట : వెలుగొండ ప్రాజెక్టుకు 2018లో కృష్ణా జలాలు వస్తాయని కలెక్టర్ వినయ్‌చంద్ తెలిపారు. బేస్తవారపేట, కంభం మండలాల్లో ఆయన పర్యటించారు. కంభం చెరువు వద్ద విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికి 14.8 కిలో మీటర్ల మేర వెలుగొండ టన్నెల్ పనులు పూర్తయ్యాయని.. రూ.95 కోట్లతో కొల్లంవాగు వద్ద హెడ్ రెగ్యులేటరీ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. మొదటి టన్నెల్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కంభం చెరువుకు నీరు వచ్చేందుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో 22 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం పరికరాలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే 11 వేల హెక్టార్లలో ఏర్పాటు చేసేందుకు రైతులు నమోదు చేసుకున్నారన్నారు. పంటకుంటలు అధికంగా తవ్వించుకోవాలని రైతులకు సూచించారు. 'నీరు-ప్రగతి' కింద రూ.250 కోట్ల పనులు చేస్తున్నట్లు తెలిపారు. చెక్‌డ్యాం నిర్మాణాల్లో లోటుపాట్లు ఉన్నాయని, సిమెంట్, ఇసుకల నాణ్యత సరిగా లేదన్నారు.

నాణ్యతగా నిర్మించాలని అధికారులకు సూచించారు. గుండ్లకమ్మ, కొరిశపాడు ప్రాజెక్టులను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలిస్తారన్నారు. కంభం చెరువు నీరు రాకుండా గుండ్లకమ్మ వాగుపై నిర్మిస్తున్న రామన్నకతువ పనులను ఆపించి చెరువుకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కంభం సర్పంచి స్టార్ బాషా, సీపీఎం నాయకుడు మల్లికార్జున వినతి పత్రం అందజేశారు. చెరువు ఆధునికీకరణ పనుల్లో అవకతవకలు జరిగాయని ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజు విన్నవించారు.

కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ వెంకట రమణ, ఈఈ విక్టర్‌బాబు, డీఈ నాగార్జునరావు, ఏఈలు అంజిరెడ్డి, శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖరయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్, డ్వామా ఏపీడీలు భవానీ, రమేష్ బాబు, ఏపీడీ పద్మావతి, ఆర్డీవో కిశోర్, తహసీల్ధార్లు, రాజ్‌కుమార్, ఉషారాణి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయభాను

# సంపాదకీయం

## బ్లూవేల్.. ప్రాణాంతక క్రీడ

మానసికంగా బలహీనులలమైన పిల్లలే సోషల్ మీడియాలో బ్ల్యూ వేల్ వంటి ప్రాణాంతక క్రీడలకు బలవుతున్నారు. దీనిలో తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉన్నది. ఎదిగీఎదగని మనస్తత్వం గల టీనేజ్ పిల్లలు విస్తారమైన డిజిటల్ ప్రపంచంలో అడుగుపెడుతున్నారు. వీరు రోజంతా కంప్యూటర్ దగ్గరే గడుపుతున్నారు. ఎదిగీఎదగని వయసులో తల్లిదండ్రుల మార్గదర్శకత్వం ఉండాలె. తల్లిదండ్రులు తమ పిల్లలను మరీ నిర్బంధం చేయనప్పటికీ, గమనిస్తూ ఉండాలె. కానీ స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు అప్పగించి వదిలిపెడుతున్నారు. తల్లిదండ్రులు రోజుకు గంటసేపు కూడా పిల్లలతో గడుపడం లేదు.

ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతం చేయవలసిన సాంకేతిక పరిజ్ఞానం వెర్రితలలు వేస్తున్నది. మెత్తని కత్తితో మానవుల కుత్తుకలను కోస్తున్నది! కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, స్మార్ట్‌ఫోన్లు మనిషి జీవితంలోకి ప్రవేశించి అరచేతిలో వైకుంఠాన్ని చూపించాయి. అంతులేని సమాచారం, విస్తృతమైన మానవ సంబంధాలు మనిషిని మరింత చైతన్యవంతుడిని చేయాల్సింది. కానీ ఉద్వేగాలు లేని, సృజనాత్మకత కొరవడిన మొద్దులుగా మారుస్తున్నాయి. బేలతనంతో బ్ల్యూ వేల్ క్రీడలో ప్రాణాలను బలిపెట్టుకునే స్థాయికి దిగజారుస్తున్నాయి. ఎక్కడో ఉండి సోషల్ మీడియాలో నిర్వాహకుడు చెప్పే కొద్దీ పిల్లలు స్వీయ హింసకు పాల్పడుతూ, చివరికి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. బ్లూవేల్ గేమ్ అనేది సోషల్ మీడియా గ్రూప్‌లలో సాగే ఒక ప్రాణాంతక క్రీడ. నిర్వాహకులు అందులో పాల్గొన్న వారి చేత తమ శరీరాన్ని బాధించుకునే పని రోజుకొకటి చేయిస్తుంటారు. యాభై రోజుల పాటు ఈ వికృత క్రీడ సాగిన తరువాత, ఆత్మహత్యవైపు పురికొల్పుతారు. బ్ల్యూవేల్ గేమ్‌తోనే ఈ సమస్య మొదలు కాలేదు. సోషల్ మీడియాలో ఇటువంటి క్రీడలు ఉన్నాయి. ఈ ప్రాణాంతక క్రీడను నిరోధించినా పిల్లల జీవితాన్ని ఈ సాంకేతిక పరిజ్ఞానం ఎక్కడికి తీసుకుపోతున్నదనేది చర్చించాల్సిన అంశమే. పిల్లల ఆలోచనా శక్తిని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దవలసిన పరిజ్ఞానం వారిని జీవ రహితంగా మార్చివేయడం ప్రమాదకర పోకడ. విస్తృతమవుతున్న డిజిటల్ ప్రపంచంలో అవకాశాలను అంది పుచ్చుకోవడం, అవాంఛనీయ పోకడలకు దూరంగా ఉండటం ఎట్లా అనేది పిల్లలకు నేర్పడంలో సమాజం విఫలమవుతున్నది. పిల్లలను వేధిస్తున్న సామాజిక ఆర్థిక సమస్యలకు సాంకేతికత వికృత పోకడలు తోడైనప్పుడు విపత్కర పరిణామాలు సంభవిస్తున్నాయి. బ్ల్యూ వేల్ గేమ్ పిల్లల ఉసురు తీసుకుంటున్నది కనుక ఇటువంటి ప్రాణాంతక క్రీడలను అరికట్టవలసిందే. కానీ పిల్లల ఆత్మహత్యలకు కారణం ఈ క్రీడలు మాత్రమే అనే తప్పుడు నిర్ధారణకు రాకూడదు. ఈ ప్రాణాంతక క్రీడలతో నిమిత్తం లేకుండా దేశంలో పిల్లల ఆత్మహత్యలు సాగుతున్నాయి. వాటిలో కొన్నింటికి ఈ క్రీడలు ఊతంగా మారాయి. మన దేశంలో సగటున ప్రతి గంటకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. 15 నుంచి 29 ఏండ్ల మధ్యన గల వారి ఆత్మహత్యలలో ప్రపంచంలోనే దేశం మొదటి స్థానంలో ఉన్నదని కొన్నాళ్ళ కిందట ఒక నివేదిక వెల్లడించింది. దేశంలోని ఆత్మహత్యలలో మూడో వంతు యువత పాల్పడినవే. 2015లో దాదాపు తొమ్మిది వేల మంది యువతీయువకులు ఆత్మహత్యకు పాల్పడినట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. అయినా దీనినొక సమస్యగా సమాజం, ప్రభుత్వం గుర్తించడం లేదు. ఆర్థిక పరిస్థితులు, చదువులు యువత మీద తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. కోచింగ్ వ్యాపార కేంద్రాలకు నిలయమైన రాజస్థాన్‌లోని కోటాలో ఆత్మహత్యలు అనేకం జరుగడం గమనార్హం. వాస్తవదూరమైన లక్ష్యాలు నిర్దేశించడం వల్ల పిల్లలపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. కొన్ని పేరు పొందిన విద్యా సంస్థలలో సీటు రాకపోతే ఇక జీవితమే లేదన్నట్టుగా ప్రచారం సాగుతున్నది. దీంతో సీటు తెచ్చుకోలేని విద్యార్థులు తాము విఫలమయ్యామనే ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కొందరు పరీక్ష రాయకముందే ఒత్తిడి భరించలేక ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. జీవితంలో నిలదొక్కుకోలేని యువకులు, ఆర్థికంగా దుర్భర పరిస్థితుల నుంచి బయటపడలేనివారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మానసికంగా బలహీనుల మైన పిల్లలే సోషల్ మీడియాలో బ్ల్యూ వేల్ వంటి ప్రాణాంతక క్రీడలకు బలవుతున్నారు. దీనిలో తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉన్నది. ఎదిగీఎదగని మనస్తత్వం గల టీనేజ్ పిల్లలు విస్తారమైన డిజిటల్ ప్రపంచంలో అడుగుపెడుతున్నారు. వీరు రోజంతా కంప్యూటర్ దగ్గరే గడుపుతున్నారు. ఎదిగీఎదగని వయసులో తల్లిదండ్రుల మార్గదర్శకత్వం ఉండాలె.

# బిడ్డకు జన్మనిచ్చిన పదేళ్ల బాలిక

చండీగఢ్: దగ్గరి బంధువు చేతిలో పలుమార్లు అత్యాచారానికి గురైన ఓ పదేళ్ల బాలిక తనకు తెలియకుండానే బిడ్డకు జన్మనిచ్చింది. కడుపులో రాళ్లు ఉన్నాయనీ, ఆపరేషన్ చేయాలని చెప్పి ఆమెను తల్లిదండ్రులు వైద్యశాలకు తీసుకొచ్చారు.

బాలిక గర్భస్రావానికి సుప్రీంకోర్టు గతనెల 28న అనుమతి నిరాకరించడంతో చండీగఢ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని ఐసీయూలో వైద్యుల బృందం ఆమెకు ఆపరేషన్ నిర్వహించి కాన్పు చేశారు. ముగ్గురు గైనకాలజిస్టులు, నియోనటాలజిస్ట్, పిడియాట్రిషియన్ వైద్య బృందంలో ఉన్నారని బాలిక ఆరోగ్య పర్యవేక్షణ కోసం నియమించిన కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి హరీశ్ తెలిపారు.

ఇది అసాధారణ గర్భమైనా సిజేరియన్ సజావుగా సాగిందనీ, శిశువు బరువు (2.2 కేజీలు) కొంచెం తక్కువగా ఉండటంతో ఐసీయూలో ఉంచామని వెల్లడించారు. బాలిక ఆరోగ్యం స్థిరంగానే ఉందన్నారు. వైద్య ఖర్చులను చండీగఢ్ పాలనయంత్రాంగం భరిస్తోందని చెప్పారు. బాలిక భవిష్యత్తు దృష్ట్యా బిడ్డను దత్తత ఇవ్వాలని ఆమె తండ్రి ఆసుపత్రి వర్గాలను కోరారు.

# సిక్కా దెబ్బకు మార్కెట్లు ఢమాల్



న్యూఢిల్లీః ఇన్ఫోసిస్ సీఈవోగా, ఎండీగా విశాల్ సిక్కా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటన వెలువడిన తర్వాత మార్కెట్లు భారీగా పతనమవుతున్నాయి. సిక్కా దెబ్బ మార్కెట్లకు భారీగా తగిలింది. సెన్సెక్స్ 400 పాయింట్ల మేర పడిపోయింది. నిఫ్టీ సైతం 9800 మార్కు దిగువకు దిగజారింది. మార్కెట్‌లో ఎక్కువగా అమ్మకాల ఒత్తిడి నెలకొన్నట్టు విశ్లేషకులు చెప్పారు. ప్రస్తుతం సెన్సెక్స్ 355.62 పాయింట్ల మేర నష్టపోతూ 31,439 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ కూడా 94.35 పాయింట్ల లాస్‌లో 9,809 వద్ద కొనసాగుతోంది. మరోవైపు సిక్కా కంపెనీ సీఈవో బాధ్యతల నుంచి వైదొలగడం ఆ కంపెనీ షేరును భారీగా దెబ్బతీస్తోంది.

ఇంట్రాడేలో 10.07 శాతం మేర పడిపోతూ రూ.918.05 వద్ద ట్రేడవుతోంది. బైబ్యాక్ జోరుతో గురువారం సెషన్‌లో ఇన్ఫీ షేరు 4 శాతం మేర జోరు కొనసాగించిన సంగతి తెలిసిందే. నేడు వెలువడిన ప్రకటనతో బైబ్యాక్ జోరుకు కళ్లెం పడింది. బైబ్యాక్ ప్రతిపాదనపై రేపు(శనివారం) జరుగబోతున్న బోర్డు మీటింగ్ నేపథ్యంలో విశాల్ సిక్కా నుంచి ఈ అనూహ్య ప్రకటన వెలువడింది. గురువారం రూ.2,34,554.78 కోట్లగా ఉన్న ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్, నేటి ట్రేడింగ్‌లో రూ.2,07,553.94 కోట్లకు పడిపోయింది. అంటే సుమారు రూ.27 కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. నేటి సెషన్‌లో రెండు సూచీల్లోనూ ఇన్ఫోసిస్, సన్ ఫార్మా, జీ ఎంటర్‌టైన్మెంట్ టాప్ లూజర్లుగా భారీగా నష్టపోతుండగా.... టీసీఎస్, హెచ్‌యూఎల్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, బీపీసీఎల్ లాభాల్లో నడుస్తున్నాయి. అటు డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు బలపడి 64.13 వద్ద ఉంది. ఎంసీఎక్స్ మార్కెట్‌లో బంగారం ధరలు 154 రూపాయల లాభంలో 29,305 రూపాయలుగా కొనసాగుతున్నాయి.

# న్యాయ విచారణపై దీప అభ్యంతరం



చెన్నై : అన్నాడీఎంకే అధినేత్రి, దివంగత ముఖ్యమంత్రి జయలలిత మరణంపై తమిళనాడు సీఎం ఎడపాడి పళనిస్వామి న్యాయ విచారణకు ఆదేశించడాన్ని జయ మేనకోడలు దీపా జయకుమార్ తప్పుబట్టారు. న్యాయవిచారణకు ఆదేశించడం హాస్యాస్పదంగా ఉందని, అన్నాడీఎంకే కార్యకర్తలను వెర్రివాళ్లను చేసేందుకే ఈ నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. 'అమ్మ' మరణంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. జయలలిత నివసించిన చైన్నై పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయం ఇంటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని స్మారక మందిరంగా మారుస్తామని పళనిస్వామి ప్రకటించడంపై దీప అభ్యంతరం వ్యక్తం చేశారు. జయ ఇల్లుపై తనకు.. తన సోదరుడికే నైతికంగా, చట్టబద్ధంగా, అధికారాలు ఉన్నాయని చెప్పారు. జయలలిత రక్తసంబధికులను సంప్రదించకుండా ఎలా ప్రకటన చేస్తారని ప్రశ్నించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానని ప్రకటించారు. కాగా, జయ మరణంపై విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి.

# 54 మంది ఐఏఎస్‌లకు నోటీసులు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారులపై చర్యలకు సిద్ధమైపోయింది. రాజ్యాంగాన్ని అగౌరవ పరిచారంటూ పేర్కొంటూ ఉన్నతాధికారులందరికీ షో కాజ్ నోటీసులు జారీ చేసింది. వీరిలో 54 మంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉండటం విశేషం.

ఆగష్టు 15 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం డెహ్రాడూన్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. ఇది గమనించిన ముఖ్యమంత్రి తివేంద్ర సింగ్ రావత్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ సెక్రటరీ రామస్వామిని ఆదేశించారు. దీంతో స్పందించిన సీఎంవో కార్యాలయం 87 మంది ఐఏఎస్ ఆఫీసర్లకు నోటీసులు పంపింది.

వీరిలో 10 మంది డిప్యూటేషన్ మీద ఉండగా, 46 మంది అదనపు సెక్రటరీలు, ఐదుగురు సెక్రటరీ ఇన్ ఛార్జీలు, ఒక ప్రిన్సిపాల్ సెక్రటరీ, మరో ఇద్దరు సెక్రటరీలు ఉన్నారు. వీరి నుంచి వివరణ కోరిన ప్రభుత్వం అది సహేతుకంగా లేని పక్షంలో వార్షిక నివేదిక సమయంలో వారిపై చర్యలు తీసుకునే ఆస్కారం ఉందని తెలుస్తోంది.

మరోవైపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గైర్హాజయ్యారయిన ఉద్యోగులపై కూడా తీసుకోవాలంటూ అధికారులకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రం ఏర్పడి 17 ఏళ్లు గడుస్తున్నా ఇంతకాలం అధికారిక కార్యక్రమాలకు హాజరుకాని వాళ్లను హెచ్చరించి వదిలేశారేగానీ, ఇలా క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం ఇదే ప్రథమమని ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి స్పందించారు.

# కవి సమయం

## మధుర భాషణం

మధుర భాషణం శాంతిమయ జీవవానికి సోపానం
ఓదార్పు నిచ్చే ఒక మంచి మాట
వెన్నెల లాంటి చల్లదన్నానిచ్చే ఒక హిత వచనం
జీవితాలను ధైర్యమిచ్చి నిలబెడతాయి
ప్రేమతో కూడిన మధురమైన పలుకులు
నడి సంద్రం లో కొట్టుకొని పోవు వారికి దొరికే ఆలంబన వంటివి
మధుర భాషణం గావించలేని వారు రజో గుణ సంపన్నులు
అసుర సమానులు, అనుక్షణం కొండంత పాపాన్ని సమకూర్చుకుందురు
కటువైన మాటలు గోడకు కొట్టిన బంతుల వంటివి
మరింత వేగం గా, తీవ్రం గా, కటువుగా వచ్చి విసిరిన వారికే తగులును
మనం నాటిన విత్తనాల పంట మనమే అనుభవించక తప్పదు
మధుర భాషణమును చేసిన బుద్ధుడు, మహమ్మద్, జీసస్ మనకు ఆధారం
అందుకే సమాజం లో సత్యం, ధర్మం, అహింస స్థాపనకు
ఆనందమయ సమ సమాజ నిర్మాణమునకు
మధుర భాషణమనే సద్గుణమును అలవర్చుకుందాం
మహనీయిలుగా చరిత్రలో సుస్థిర స్థానమును సాధించుకుందాం

కవిత రచన :
సి . ప్రతాప్
సెల్ నెం: 90636 22665

# పంచాంగం

మాసం : శ్రావణ : తిథి : ద్వాదశి ఉ. 6.13 త్రయోదశి రా.తె. 3.53 పునర్వసు రా. 7.19 వ.ఉ. 8.04ల 9.34 వ.ఉ. 80.4 ల9.34

శనివారం 19-08-2017

**మేషం** : మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిధునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్య వేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విష యాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

# స్వామి కన్నా నామమే మిన్న

## సంకీర్తన

అయోధ్యా నగరంలో శ్రీరామచంద్ర భగవానుడు రాజ దర్బారులో విరాజిల్లుతున్నాడు. దేవర్షి నారదుడు, విశ్వామిత్రుడు, వశిష్ఠాది మహర్షులెందరో ఉన్న ఆ సభలో ఒక ధార్మిక విషయం మీద చర్చ కొనసాగుతోంది. ఉన్నట్టుండి నారద మహర్షి భగవంతుడు గొప్పవాడా? భగవన్నామం గొప్పదా? అన్న సమస్యను లేవనెత్తాడు. దానిపై అక్కడ వాగ్వివాదం చెలరేగింది. కాలం గడుస్తున్నదే గాని ఋషి గణం ఒక నిర్ణయానికి రాలేకపోయారు. అదే సమయంలో హనుమంతుడు ఆ సభలోకి అడుగుపెట్టాడు. అతన్ని చూడగానే దేవర్షి మదిలో ఓ ఆలోచన మెరిసింది. వెంటనే ఆయన వాయు పుత్రుని వద్దకెళ్ళి, మహావీరా! ఇప్పుడు నీవు శ్రీరామునితోబాటు ఋషి వర్యులందరికీ నమస్కరించు. ఒక్క విశ్వామిత్రునికి మాత్రం నమస్కరించవద్దు. కారణం తర్వాత చెబుతాను అన్నాడు. నారదుని మాట కాదనలేక ఆయన చెప్పినట్టు చేశాడు హనుమ. విశ్వామిత్ర మహర్షి మనస్సు చివుక్కుమంది. అది కనిపెట్టిన నారదుడు ఒక్క అంగలో విశ్వామిత్రుని చెంత చేరి, మహర్షీ! హనుమంతునికి ఎంత గర్వమో చూశారా? నిండు సభలో మీకు తప్ప అందరికీ నమస్కరించాడు. మీరు తక్షణం అతడిని శిక్షింపజేయాలి! అన్నాడు.

దాంతో విశ్వామిత్రుడు అగ్నిహోత్రుడయ్యాడు.

ఆయన శ్రీరాముని సమీపించి, రాజా! నీకళ్ళెదుటే ఆంజనేయుడు నన్ను ఘోరంగా అవమానించాడు. కనుక రేపు సూర్యుడు అస్తమించే లోగా నీ చేతులతో అతనికి మరణదండన విధించాలి! అని ఆజ్ఞాపించాడు. శ్రీరాముడు నిశ్చేష్టుడయ్యాడు... అనన్య భక్తుడైన మారుతికి మరణదండన విధించడమా?... ఇది తనకు సాధ్యమయ్యే పనేనా... ఏమిటీ సంకట పరిస్థితి?... చాలాసేపు మధనపడి చివరకు గురువాజ్ఞ పాటించక తప్పదని నిర్ణయించుకున్నాడాయన. ఈ విషయం కొద్దిసేపట్లోనే నగరమంతా వ్యాపించింది. హనుమంతునికి మహాదుఃఖం కలిగింది. నారదుని చూస్తూ దేవర్షీ! మీరు చెప్పినట్టు చేసినందుకు ఇదా ఫలితం? భగవానుడు రేపు నన్ను వధిస్తాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? అన్నాడు రుద్ధమైన కంఠంతో. అప్పుడు నారదుడు హనుమంతా! భయపడకు.

రేపు బ్రహ్మ ముహూర్తంలో సరయూ నదిలో స్నానంచేసి, చేతులు జోడించి శ్రీరామ జయ రామ జయ జయ రామ అని జపించు. విశ్వాస పూర్వకంగా చెబుతున్నాను. నీకెటువంటి ప్రమాదం జరగదు! అని అభయమిచ్చాడు. మరునాడు సూర్యోదయానికి పూర్వమే హనుమంతుడు సరయూ నదీ తీరానికి వచ్చాడు. స్నానమాచరించి నారద మహర్షి చెప్పిన విధంగా రామనామాన్ని జపించసాగాడు. జరగబోయే సంఘటన తిలకించడానికి మహర్షులతోబాటు అశేష జనం అక్కడికి వచ్చారు. శ్రీరాముడు హనుమంతునికి కొంత దూరంలో నిలబడి, కరుణార్ద్ర దృష్టితో చూస్తూ,



అనిచ్ఛాపూర్వకంగానే అతడిపై బాణాలను వర్షింపసాగాడు. అలా సూర్యాస్తమయం వరకూ శ్రీరాముడు బాణాలు వర్షింపజేస్తున్నా ఏ ఒక్కటీ శ్రీ రామనామం జపిస్తున్న మారుతిని బాధించలేకపోయింది. కుంభకర్ణాది మహారాక్షసులను వధించడంలో ఉపయోగించిన భయంకరాస్త్రాలు కూడా నిరుప యోగమయ్యాయి. ఇలా కాదని శ్రీరామ భగవానుడు బ్రహ్మాస్త్రాన్ని ఎత్తాడు. హనుమ చిరునవ్వుతో శ్రీరాముని చూస్తూ ఆత్మసమర్పణ చేసి, పూర్ణ్భావంతో ఆయన నామాన్ని జపిస్తూ స్థిరచిత్తంతో నిలబడిపోయాడు. పరిస్థితి గమనించిన నారదుడు విశ్వామిత్రుని చూస్తూ, మహర్షీ! ఇక మీరు మారుతిపై కోపాన్ని ఉపసంహ రించుకొని బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని నివారించండి. ఇప్పటికే శ్రీరాముడు అలసిపోయి ఉన్నాడు. ఇక్కడున్న అశేష జనవాహినితోపాటు మీరుకూడా శ్రీరామనామ మహిమను ప్రత్యక్షంగా చూశారు కదా! అన్నాడు చిరుదరహాసంతో. భగవంతుని కంటే భగవన్నామమే మిన్న అయినదని విశ్వామిత్రునితోపాటు అక్కడున్న యావన్మందికీ అర్థమైంది.

అది నిరూపించడానికే నారదుడీ గొడవను సృష్టించాడని తేటతెల్లమైంది... విశ్వామిత్రుడు శ్రీరాముని చేత బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని విరమింపజేశాడు. ఆనందంతో వచ్చి వాయుపుత్రుడు తన ప్రభువు చరణకమలాలపై వ్రాలిపోయాడు. పిమ్మట విశ్వామిత్రునికి ప్రణమిల్లాడు. ప్రసన్న వదనంతో విశ్వామిత్ర మహర్షి హనుమను ఆశీర్వదించి- సంపూర్ణ శ్రద్ధాభక్తులతో శ్రీరామనామాన్ని జపించేవారికి సర్వపాపాలు హరించబడతాయనీ, సకల శుభాలు కలుగుతాయని ప్రవచిం చాడు. అందుకే అడుగడుగునా ఈ కలియుగంలో పాపారాశులే కనబడుతున్నా సరే శ్రీరామ నామాన్ని జపిస్తే చాలు ఆ పాపరాశులు మనలను అంటవు. నిరంతరమూ రామనామంతో మనసు, తనువు పులకించేలా జపం చేయగలగాలి. ప్రహ్లాదుడు చెప్పినట్టుగా తింటున్నా, తాగుతున్నా, నిద్రిస్తున్నా, నడుస్తున్నా సరే ఎపుడైనా భగవంతుని నామాన్ని మాత్రం వదలరాదు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# మంత్రి దిష్టిబొమ్మ దగ్ధం

పీలేరు: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మను పీలేరులో మాలమహానాడు ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ధరణీకుమార్ మాట్లాడుతూ.. బాధ్యత గల మంత్రి పదివిలో ఉండి దళితులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. తరతరాలుగా అణగదొక్కబడుతున్న దళితులు ఎలా అభివృద్ధి చెందుతారని ఆయన ప్రశ్నించారు. దళితులు చదువుకోవద్దని, ఉద్యోగాలు చేయకూడదని వారిని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కష్టజీవులుగా బతుకుతున్న దళితులు ఎలా శుభ్రంగా ఉండాలో మంత్రి తెలియజజెప్పాలని డిమాండు చేశారు. ఇలాంటి పరిస్థితులను అధిగమిస్తూ భారత రాజ్యాంగం ద్వారా సిద్ధించే హక్కులతో దళితులు ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తున్నారని అన్నారు. కష్టజీవులైన దళిత కుటుంబాల్లోనూ మేధావులు, విద్యావంతులు ఉన్నారనే విషయాన్ని మంత్రి గుర్తించాని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, సదాశివ, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాలనలో విప్లవాత్మక నిర్ణయాలు

## భాజపా రాష్ట్ర నాయకుడు కందుల రాజమోహన్‌రెడ్డి



కడప : ప్రజా సంక్షేమమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కందుల రాజమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక భాజపా జిల్లా కార్యాలయంలో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానిగా మోదీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి దేశంలో ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. అవినీతిపరుల గుండెల్లో నిద్రపోతూనే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రధాని మోదీ చేపడుతూ వచ్చారన్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా అవినీతిపరులను ఆటకట్టించేందుకు పెద్దనోట్ల రద్దు, దేశమంతా ఒకే పన్ను విధానం తేవాలని జీఎస్‌టీ ఇలా విప్లవాత్మక మార్పులను ప్రధాని మోదీ తెచ్చారని కొనియాడారు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్‌ను గెలుపించుకుని అట్టడుగు వర్గాల వారు అత్యున్నత స్థాయికి చేరుకోగలరని ప్రధాని నిరూపించారన్నారు. దేశ రక్షణ విషయంలో మోదీ తీసుకున్న నిర్ణయాలు మనదేశ ప్రతిష్ఠను బాగా పెంచాయన్నారు. చైనాతో భూభాగ రక్షణపై మన దేశ ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని దేశాలు సపోర్టు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. భాజపాలో కుటుంబ పాలన లేకుండా తగు జాగ్రత్తగా ఉన్నారన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీల్లో కుటుంబ పాలన సాగుతోందన్నారు. ఈ రాష్ట్రంలో భాజపాను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు. కడప జిల్లాకు రావాల్సిన ఉక్కు పరిశ్రమ కచ్చితంగా వచ్చేలా చూస్తామన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు భాజపా కట్టుబడి ఉందన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్రంలో పర్యటిస్తారన్నారు. రాష్ట్రంలో భాజపాను బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు.

ఈ నెల 19న జిల్లా పథాధి కారుల సమావేశాన్ని కడపలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో 2570 పోలింగ్ బూత్‌లున్నాయన్నారు. ఇందులో 1500 పోలింగ్ బూత్‌లను పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన పోలింగ్ బూత్‌ల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేఎంఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలమారెడ్డి, భాజపా నాయకులు సాంబశివ, పట్నం ఎరికలప్ప, లక్ష్మణ్‌రావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పాత కడప చెరువును నీటితో నింపాలి

## కలెక్టర్‌ను కోరిన సమీప గ్రామాల రైతులు



కడప : నగరంలోని పాతకడప చెరువులోని మట్టిని అక్రమంగా అమ్ముకుంటున్నారని నీరు చెట్టు పనులలో రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోందని పలు ప్రాంతాల రైతులు కలెక్టరుకు వినతిపత్రం అందించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర నేతృత్వంలోని పాతకడప, మేడమీదపల్లె, పాలెంపల్లె, రూకవారి పల్లె తదితర ప్రాంతాలకు చెందిన రైతులు కలెక్టర్ బాబూరావునాయుడుని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 570 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాత కడప చెరువులో ఏటా పూడికతీత పనులు జరుగుతున్నాయని కానీ నీరు నిలబడక సుమారు 40 టీఎంసీల వరకు బయటకు వెళ్లిపోతోందన్నారు. అంతేగాకుండా చెరువులోని మట్టిని ట్రాక్టర్లతో విక్రయించుకుంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ప్రస్తుతం ఉన్న చెరువును చేపల పెంపకం కోసం శ్మశానం కోసం ఆక్రమించుకుని ఆయకట్టును తగ్గించే పనులు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే చెరువులో నీటిని నింపి నీరు చెట్టు పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటరమణ, చెన్నయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

# రైతు రిట్ పిటిషన్‌పై కలెక్టర్ పరిశీలన

కొత్తపేట : మందపల్లి పరిధిలో కపిలేశ్వరపురం మండలం కేదార్లంక సమీపంలో కూరగాయల రైతులందరూ కలిసి భక్తాంజనేయ కూరగాయల రైతల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ కూరగాయల కలెక్షన్, గ్రేడింగ్, మార్కెటింగ్‌కు కేంద్రం ఏర్పాటు చేసి మే నెలలో ప్రారంభించారు. అయితే కేంద్రం వెనుక స్థలానికి చెందిన రైతు సలాది రామ్మోహన్‌రావు తన స్థలానికి తూర్పు వైపున మార్గం లేదంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా వచ్చి కూరగాయల కేంద్రం, వెనుక స్థలం పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో నిర్మించిన దుకాణ సముదాయంలో ఒకటి, కొద్దిదూరంలో మరొక మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కలెక్టర్ కార్తికేమ మిశ్రాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని అమలాపురం ఆర్డీవో జి.గణేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట సంయుక్త కలెక్టర్ మల్లికార్జునరావు, ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు కె.శ్రీనివాసు, తహసీల్దారు ఎన్.శ్రీధర్, ర.భ.శాఖ డీఈ సత్యవతి, విశ్రాంత డీఈ వై.రాధాకృష్ణ, ఎంపీడీవో పి.వీణాదేవి, ర.భ.శాఖ ఏఈ వర్మ, ఉద్యానశాఖాధికారిణి ఎం.బబిత, కేదార్లంక సర్పంచి రంకిరెడ్డి సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

# ఒకరికి ఒక ఖాతానే ఉండాలి

చెరుకుపల్లి : ఒక రైతుకు ఒక రెవెన్యూ ఖాతానే ఉండాలని తహసీల్దారు శేషుకుమార్ అన్నారు. మండలంలోని పొన్నపల్లిలో ఆయన రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు రాకుండా ప్రభుత్వం భూ వివరాలను ఆన్‌లైన్ చేసిందని తెలిపారు. రైతుకు ఎంత భూమి ఉన్నా, ఎక్కడెక్కడ ఉన్నా అతనికి ఇచ్చే ఖాతా నెంబరులోనే అన్నీ పొందుపరిచి ఉంటాయన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను అధిగమించవచ్చని సూచించారు. ప్రస్తుతం రైతుల వివరాలు తికమకగా ఉన్నాయని, కొందరి భూములు వేరొకరి ఖాతాల్లో కలిసిపోవడం సమస్యగా మారిందన్నారు. దీన్ని అధిగమించడానికి రెవెన్యూ సభలను ఏర్పాటు చేశామని వివరించారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. సర్వే నెంబర్ల సమస్యతో ఆరు అర్జీలు అందగా వాటిని వెంటనే పరిష్కరించాలని సర్వే బృందాన్ని ఆదేశించారు. శుక్రవారం ఆరుంబాక రెవెన్యూ గ్రామ పరిధిలోని గుళ్లపల్లి, చెరుకుపల్లి, ఆరుంబాక గ్రామాలకు సంబంధించి గ్రామసభను తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, సర్పంచి ఏడుకొండలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### విద్యుత్తు తీగలు తగిలి వ్యక్తి మృతి

పుల్లలచెరువు: విద్యుత్తు తీగలు తగిలి లారీ క్లీనర్ మల్లికార్జున(30) మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన పుల్లలచెరువు విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలో రాళ్లను దింపేందుకు ప్రయత్నిస్తుండగా పైన ఉన్న కేబుల్ వైర్‌లు తప్పించేందుకు క్లీనర్ లారీపైకి వెళ్లాడు. పైన ఉన్న విద్యుత్తు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు.

# జీఎస్టీ ప్రయోజనం వినియోగదారులకు చేరాలి

గొడుగుపేట : జీఎస్టీ పన్ను ప్రయోజనం వినియోగదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని జేసీ గంధం చంద్రుడు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన జిల్లాలో అమలవుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థలోని లోటుపాట్లు, ఈపోస్ అమలు, ఆహారకల్తీ, ధరల నియంత్రణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. జిల్లాలో 2,267 రేషన్ దుకాణాలు ఉన్నాయని, డిపోల క్రమబద్ధీకరణ చేపట్టి ఒక్కొక్క దుకాణానికి 546 కార్డులకు తగ్గించగలిగామని చెప్పారు. ఈపోస్ అమలు ద్వారా అక్రమాలు అరికట్టి ఆదా అయిన సొమ్ముతో రూ.1700కోట్ల విలువైన రంజాన్‌తోఫా, సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు అందించామన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్ కాటాలు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెడుతున్నామనీ. జిల్లాలో అందరికీ గ్యాస్ కనెక్షన్లు అందించి పొగరహిత జిల్లాగా ప్రకటించామని చెప్పారు. జిల్లాలోని అన్ని రైతుబజార్లలో ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 10.68లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించి రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచామని అన్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత కొన్ని నిత్యావసరాలపై పన్ను లేదని, కొన్నింటిపై 5శాతం ఉందని, పన్ను ప్రయోజనంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చక్కెర, కిరోసిన్ సబ్సిడీ కేంద్రం నిలిపివేసిందని , పేదప్రజలు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే రాయితీ భరించి సరకులు ఇచ్చే ఆలోచనలో ఉందన్నారు. ఆహార తనిఖీ అధికారుల సంఖ్య పెంచడానికి ప్రభుత్వానికి లేఖ రాశామని చెప్పారు.ఆహార నమూనాలు పరీక్షించేందుకు ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కొందరు డీలర్లు ఇవ్వని సరకులకు కూడా నగదు ఉపసంహరించి వారి ఖాతాల్లో వేసుకుంటున్నట్లు తెలుస్తోందని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తిరుపతిలో స్పర్శ ఆసుపత్రి ప్రారంభం



తిరుపతి : అత్యాధునిక సాంకేతిక పరికరాలతో నగరంలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో స్పర్శ హాస్పటల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.రమణయ్య హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా స్పర్శ హాస్పటల్ అధినేత డాక్టర్ హరిబాబు, డాక్టర్ హరీస్, డాక్టర్ సునీత మాట్లాడుతూ నూతన ఆసుపత్రిలో అడ్వాన్స్‌డ్ ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు, థైరాయిడ్ సర్జరీలు, బ్రెస్ట్, హెర్నియా సర్జరీలను, మొలలకు లేజర్ చికిత్స చేయను న్నట్లు చెప్పారు. స్త్రీల సమస్యలతో పాటు సంతా నంలేని వారికి ప్రత్యేక చికిత్స అందించ నున్నట్లు తెలి పారు. అత్యవసర రోగుల కోసం 24గంటలు అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తుడా ఛైర్మన్ నరసింహ యాదవ్, డాక్టర్ సిపాయి సుబ్రహ్మ ణ్యం, డాక్టర్ హరినాధ్, డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ హేమ కుమార్‌రెడ్డి, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ మధు సూధన్, డాక్టర్ నాగరాజు, ఆసుపత్రి మేనేజర్ వెంకటేష్ యాదవ్, అసిస్టెంట్ మేనేజర్ పెను బాల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయానికి ఊతం

## రూ.10 కోట్లతో నూతన ప్రాజెక్టు ఏర్పాటు



జిల్లా వ్యవసాయాధికారి ఠాగూర్ నాయక్

బద్వేలు : రాష్ట్ర ప్రభుత్వం రైతుల ముంగిటికి ఆధునిక సేద్య పద్ధతులు తీసుకువచ్చిందని వ్యవసాయశాఖ జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఠాగూర్ నాయక్ పేర్కొన్నారు. బద్వేలు పురపాలికలోని అగ్రహారంలో ఆధునిక యంత్రంతో వరి నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కువగా వరి సాగయ్యే కడప, బద్వేలు, రాజంపేట, ప్రొద్దుటూరులలో ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వ రూ. 10 కోట్లతో ప్రాజెక్టును ఏర్పాటు చేసిందన్నారు. దీన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఆధునిక యంత్రాలతో వ్యవసాయ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా బద్వేలు ప్రాంతంలోని అగ్రహారంలో ప్రయోగాత్మకంగా యంత్రంతో వరినాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కూలీల కొరత అధిగమించడంతోపాటు పంట దిగుబడులను ఈ యంత్రం ద్వారా పెంచుకోవచ్చన్నారు. ఈ యంత్రం ద్వారా నాటే ఖర్చు 25 నుంచి 30 శాతం తగ్గుతుందన్నారు. ఈ యంత్రం ద్వారా వరి నాటదలచుకున్న రైతులు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. సమావేశంలో నాటి యాజమాన్య సంస్థ పీడీ విజయకుమార్, బద్వేలు వ్యవసాయ సంచాలకులు మురళి, బద్వేలు, గోపవరం, కలసపాడు, మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు చంద్రమోహన్, సురేష్‌రెడ్డి, విజయరావు, ఆదర్శరైతు కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

## మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



గుంటూరు: నిర్ణీత ధర కంటే రైతుబజార్లలో అధిక ధరలకు మించి విక్రయిస్తే అనుమతులు రద్దు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నగరంలోని రైతుబజార్లు, పెట్రోల్ బంకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. తొలుత ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రైతు బజారును పరిశీలించారు. అక్కడ విక్రయాల తీరును పరిశీలించి, కూరగాయల్లో పగిలిపోయి ఉన్న వాటిని తీసివేయాలని సూచించారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పూల మార్కెల్ వద్ద కూడా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, వినియోగదారులకు ఏ వస్తువు ఎంత ధర ఉందనేది పట్టికలో చూసి తెలుసుకునేలా ఉండాలన్నారు. విక్రయదారులకు సంబంధిత శాఖ నుంచి జారీచేసిన గుర్తింపు కార్డును, తూనికలు కొలతల శాఖ జారీ చేసిన అనుమతి పత్రాన్ని దుకాణంలో కచ్చితంగా ఉంచాలని తెలిపారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించారు. అక్కడే ఉన్న తినుబండారాల దుకాణాన్ని పరిశీలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలియటంతో దుకాణ నిర్వాహకునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చుట్టుగుంట వద్ద రైతు బజార్‌లో 8 గంటల సమయంలో ధరల పట్టికను ఉంచుతున్నారని తెలియటంతో ఉదయం 6 నుంచి 6.30 గంటల వ్యవధిలో ధరల పట్టికను అందుబాటులో ఉంచాలని, అలాకాకుండా ఇకపై సమయం దాటిన తర్వాత ఉంచితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తనిఖీల్లో భాగంగా శ్రీనివాసరావుతోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్న అమృత హస్తం పథకం తీరును పరిశీలించారు. ఆ సమయంలో బాలింతలకు వండుతున్న సాంబారును మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. కేంద్రంలో ఇస్తున్న ఉడకబెట్టిన గుడ్డును పరిశీలించి అనంతరం బాలింతలకు ఇస్తున్న భోజనాన్ని రుచిచూశారు. అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అవుతున్న బియ్యం, ఇతర సరకులను పరిశీలించారు.

పెట్రోల్ బంకుల్లో వ్యత్యాసాలు వస్తున్నట్లు తెలియటంతో కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న పెట్రోల్ బంకును మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలోనే తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో పంపింగ్ చేయగా సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల అనంతరం మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విలేకరులతో మాట్లాడుతూ నగరంలో కారం, నూనెలు, పప్పుదినుసులు ఇతర నిత్యావసరాలలో కల్తీ జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే దుకాణాలపై దాడులు నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వంచే ధ్రువీకరించిన సరకులను మాత్రమే డీలర్లు సరఫరా చేయాలని సూచించినా.. దానికి భిన్నంగా సరకు ఉంటే వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. తనిఖీల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సంయుక్త పాలనాధికారి క్రితికా శుక్ల, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణచైతన్య, శిశు సంక్షేమశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల కొనుగోలుకు చర్యలు : డీజీ

తునిపట్టణం : విపత్తు నివారణ, అగ్నిమాపకశాఖ కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు కొత్తగా 18 వాహనాలను కొనుగోలు చేస్తున్నామని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ కె.సత్యనారాయణ తెలిపారు. తుని పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించిన ఆయన ఆధునిక పద్ధతిలో అత్యవసర సేవలందించేలా వాహనాలను సిద్ధం చేస్తున్నామన్నారు. వరదలు, బావులు తదితర వాటిలో చిక్కుకున్నవారిని కాపాడేందుకు ఫస్ట్ రెస్క్యూ రెస్పాండ్ వెహికల్ పేరిట సేవలందించడానికి ఉన్న పాత వాహనాలనే కొన్నింటిని ఆధునికీకరించి తొలి విడతలో అయిదింటిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,600 మంది యువకులు వలంటీర్లుగా తమ పేర్లు నమోదు చేయించుకున్నారని, వారికి పలు దఫాలుగా శిక్షణ ఇస్తున్నామని, మేమిచ్చే ధ్రువీకరణ పత్రం వారికి పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఉపయోగపడుతుందన్నారు. బాణసంచా తయారీకి లైసెన్సులను తమ శాఖ ద్వారా జారీ చేయడంలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జిల్లా కలెక్టర్ల ద్వారా ఆ ప్రక్రియ జరుగుతుందన్నారు. అయితే అక్రమంగా బాణసంచా తయారుచేసే వారి వివరాలను స్థానికాధికారులు సేకరించి ఉన్నతాధికారులకు పంపుతారన్నారు. కుప్పం, పెద్దాపురం, తిరుపతిలలో రూ. 1.25కోట్ల చొప్పున వెచ్చించి అగ్నిమాపక కేంద్రాల భవనాలు నిర్మిస్తున్నామన్నారు.

నెల్లూరు శ్రీసిటీ, ప్రకాశం జిల్లా దర్శిలలో కొత్తగా అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైడ్రాలిక్ ప్లాట్‌ఫాం లను రాజధాని రీజియన్ జిల్లాల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేసి, సామగ్రి వినియోగం ఏవిధంగా చేస్తున్నారన్నది మాక్ డ్రిల్ ద్వారా తెలుసు కున్నారు. ఆయన వెంట డీఎఫ్‌వో ఉదయ్ కుమార్, తుని అగ్నిమాపకాధికారి కె.విరమణ తదితరులు ఉన్నారు.


# ప్రాణాలను కబళించే 'స్మోకింగ్'



ఇవాళ పొగ తాగడం ఒక స్టైల్‌గా మారింది. కాని దానివల్ల కలిగే దుష్పరిణామాలు తీవ్రమని తెలిసినా పెద్దగా పట్టించుకోవడంలేదు. పొగతాగే వారిలో క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే.. పొగతాగే వారికన్నా వారు బయటకు వదిలిన పొగను పీల్చేవారు త్వరగా ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురవుతుంటారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ 1980 నుంచి పొగాకు వినియోగాన్ని నియం త్రించడానికి సహకరించే సంస్థలకి లేదా వ్యక్తికి అవార్డులు ఇవ్వడాన్ని ప్రారంభించింది. 2009లో జరిగిన అధ్యయనాల ప్రకారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నాడు ప్రతి పదిమందిలో ఒకరు మాత్రమే పొగ తాగడం మానేస్తున్నట్లు తేలింది. పొగ తాగేవారిలో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులతోపాటు పెదవి నుండి ముక్కు లోపలి భాగాల్లో, నోటి లోపల, గొంతులో, స్వరపేటిక, అన్నవాహిక, జీర్ణాశయం, కాలేయం, కిడ్నీలు, చివరికి ఎముకల మజ్జలో కూడా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులకి ఈ అవకాశాలు ఎక్కువ. పొగాకులో ఉన్న నికోటిన్ పీల్చిన వెంటనే అది మెదడుకు చేరి కేంద్ర నాడీమండలాన్ని ఉత్తేజం చేస్తుంది. ఉత్తేజంతోపాటు అది నేరుగా రక్తంలో కలుస్తుంది. ఫలితంగా మూత్రపిండాల వడపోతలో ఇది వాటిని దెబ్బతీసి కిడ్నీ క్యాన్సర్‌కి కారణమవుతుంది. అక్కడి నుండి మూత్రనాళాలకి వ్యాప్తి చెందుతుంది. పొగాకులో ఉన్న నికోటిన్ ఇతర రసాయనాలు ఒక క్రమపద్ధతిలో జన్యువుల చేత నియంత్రించబడే కణాల పెరుగుదలని పెంచివేస్తుంది. ఫలితంగా శరీరంలో కణితలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఇన్ని దుష్ఫలితాలుంటాయని తెలిసినా ఈ దురలవాటుకు బానిసలవుతూనే ఉన్నారు. పొగ రక్కసి కోరల్లో చిక్కి జీవితాన్ని బలి పెట్టుకుంటున్నారు. తమ కుటుంబ సభ్యుల్ని అనాధలుగా మిగులుస్తున్నారు.

# ఈ లక్షణాలు మీకుంటే మీరు మేధావే..!



మేధావి అనే మాట వినగానే ముఖం అలా వెలిగిపోతుంది. ఓ మేధావి గురించి మాట్లాడినా, చెప్పినా, లేదా అతడిని చూసినా ఓ రకమైన సంతోషం కలుగుతుంది. ఇంతకీ మేధావి అంటే ఎవరు? అసలు అతడికి ఎలాంటి లక్షణాలు ఉంటాయి? మేధావి గురించే మాట్లాడుకునే వారిలో మేధావి లక్షణాలు లేవా.. మేధావి కావాలంటే ఎలాంటి లక్షణాలు ఉండాలి అనే అంశంపై బ్రిటన్‌కు చెందిన ఓ అధ్యయనం కొన్ని వివరాలు వెల్లడించింది. ముఖ్యంగా ఈ ఐదు లక్షణాలు ఉంటే మాత్రం మేధావేనట. ఆ లక్షణాలేమిటో ఒకసారి పరిశీలిస్తే..

**1. ప్రతి విషయం గురించి అమితమైన ఆసక్తి**

ఒకే అంశానికి పరిమితం కాకుండా నిరంతరం భిన్న విషయాలను పఠించి వాటిని నేర్చుకోవడం మేధావి లక్షణం. జీనియస్‌లంతా ఇలాగే చేస్తారట.

**2.మీలో మీరు మాట్లాడుకోవడం**

సాధారణంగా కొంతమంది వ్యక్తులు తమలో తాము మాట్లాడుకుంటుంటారు. అప్పుడప్పుడు ఆ మాటలు బయటకు కూడా వినిపిస్తాయి. వారిని చూసి కొంతమంది నవ్వుకుంటారు కూడా. అయితే, అలా మాట్లాడుకునేవారు అస్సలు సిగ్గుపడొద్దట. ఎందుకంటే మేధావులు అలాగే చేస్తారని అధ్యయనం చెబుతోంది.

**3.పుస్తకాల పురుగు**

సాధారణంగా ఎవరైతే నిత్యం పుస్తకాల్లో మునిగి ఉంటారో వారంతా జీనియస్ అంట. వారు పిచ్చిపట్టిన వారిలా పుస్తకాలు చదువుతూ కనిపిస్తారట.

**4.కష్టాలతో ఎంజాయ్**

మేధావులు కష్టాలను సవాలుగా తీసుకుని, వాటిని సొంత తెలివితేటలతో పరిష్కరించుకొని ఆనందంగా గడిపేస్తారంట.

**5.తప్పులు క్షమించి మర్చిపోగలిగే తీరు**

సాధారణంగా మేధావులు తప్పు చేసిన వారిని క్షమిస్తారట. అసలు ఆ విషయాలను అంతపెద్దగా పట్టించుకోరంట. ఒక వేళ ఎవరైనా ఆ తప్పులను గుర్తు చేస్తే ఎప్పుడు? అవునా అంటూ జీనియస్‌లు ప్రతిస్పందిస్తారంట.

# కంటి కింద నల్లవలయాల నివారణకు...



ప్రస్తుత కాలంలో చాలా మంది కళ్లజోడును ధరిస్తున్నారు. కళ్ళ జోళ్ళు దీర్ఘకాలం పాటు వేసుకోవడం వల్ల ముక్కుమీద నల్లని చారలు శాశ్వత మచ్చలుగా అభివృద్ధికి దారితీస్తుంది. కళ్లజోడును ధరించడం దీర్ఘకాలం పాటు పాటిస్తున్నట్లె%తే అది ఒక అలవాటుగా మరుతుంది. కళ్ల జోడు ధరించడం వల్ల ఏర్పడే ముక్కుమీద నల్లని మచ్చలను తొలగించడానికి అవకాశం ఉంది. అందుకు కొన్ని హోం రెమడీస్ మరియు బేసిక్ టిప్స్ ఉన్నాయి. ఇవి ముక్కు మీద మచ్చలను తొలగించడం మాత్రమే కాదు తిరిగా అటువంటి మచ్చలు ఏర్పడకుండా నివారిస్తాయి. క్రింద ఇవ్వబడ్డ కొన్ని హోం రెమడీస్ కంటి అద్దాలు పెట్టుకోవడం వల్ల ముక్కుమీద ఏర్పడ్డ నల్ల మచ్చలను తొలగించుకోవచ్చు.

**హీలింగ్ ప్రోత్సహించండి**

మీరు కంటి అద్దాలు నిరంతరం పెట్టుకొంటున్నట్లైతే.. ముక్కమీద నల్లమచ్చలు రాకుండా ఉండాలంటే రోజులో అప్పడప్పుడు కళ్ల అద్దాలు పెట్టుకోకుండా కళ్లకు విశ్రాంతి కలిగించండి. దాంతో నల్ల మచ్చలు ఏర్పడవు ఆ ప్రదేశంలో బ్యాక్టీరియా మరే ఇతర ఇన్ఫెక్షన్లు కలగకుండా మిమ్మల్ని కాపాడుతుంది. మీ చర్మాన్ని ముఖ్యంగా ముక్కు మీద రోజుకు రెండు సార్లు శుభ్రం చేసుకోవడం వల్ల నల్లమచ్చలను నివారించవచ్చు. దాంతో ముక్కుమీద ఎరుపుదనం తగ్గుతుంది. దురద ఇతర ఇన్ఫెక్షన్లు రాకుండా నివారించుకోవచ్చు. మరియు మచ్చలు పూర్తిగా తొలగి పోతాయి.

**మాయిశ్చరైజింగ్**

మచ్చలు కల్యూజ్డ్ కణజాలం వల్ల ఏర్పడుతాయి. కాబట్టి వీటికి రెగ్యులర్ మాయిశ్చ రైజర్ అప్లై చేయడం వల్ల ఆ ప్రదేశం తేమగా మారి చర్మానికి రక్షణకల్పిస్తుంది. ఇది చివరికి మచ్చలు తొలగింపునకు దారి ంతీస్తుంది. ఇది క్రమం తప్పకుండా రోజుకు రెండు సార్లు ముక్కుమీద మాయిశ్చరైజర్ రాయడం వల్ల నల్ల మచ్చలు, చారలు పూర్తిగా నయం అవుతాయి.

**నేచురల్ బ్లీచింగ్**

మచ్చలు ఏర్పడ్డ ప్రాతంలో బ్లీచింగ్ చేయించుకోవడం వల్ల సాధారణ చర్మంతో పోల్చితే ఆ ప్రాంతంలో మరింత కాంతివంతంగా కనిపిస్తుంది. రసాయ నాలతో బ్లీచింగ్ చేయించుకోవడం కంటే సహజంగా టమోటో లేదా బంగాళదుంపల స్లైస్ తో ముక్కు మీద రుద్దడం వల్ల మచ్చలను మాయం చేసుకోవచ్చు. వీటిని ఉపయోగించేటప్పుడు తప్పనిసరిగా తాజాగా ఉన్నవి ఎంపిక చేసుకోవాలి.

**టోనర్ అప్లై చేయాలి**


చర్మానికి సరైన రెగ్యులర్ టోనింగ్ చేయించుకోవడం వల్ల ఇది మరో మంచి పద్ధతి. కంటి అద్దాలు రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల ఏర్పడ ముక్కుమీద మచ్చలు పూర్తిగా నివారించదలుచుకొన్నట్లైతే టోనర్‌ను తరచూ అప్లై చేస్తుండాలి. టోనర్ రాయడం వల్ల చర్మం మరింత స్ట్రాంగ్‌గా సాగే గుణాన్ని కలిగించడంతో ఈ హెల్తీ స్కిన్ మీద మచ్చలు ఏర్పడటానికి అవకాశం ఉంటుంది.

**నేచురల్ రెమడీస్**

సహజ చిట్కాలు అంటే కీరదోసకాయ ముక్కలు, విటమిన్ ఇ బాదాం ఆయిల్ ఓట్ మీల్-పాల మిశ్రమం తేనె వంటివి రెగ్యులర్ గా చర్మంమీద అప్లై చేసి రుద్దడం వల్ల కంటి అద్దాలు పెట్టుకోవడం వల్ల ఏర్పడ్డ మచ్చలను సులభంగా తొలగించుకోవచ్చు.




# చెవి కాస్త పదిలం




చెప్పులోని రాయి... చెవిలోని జోరిగ పెట్టే ఇబ్బంది అంతా ఇంతా కాదని అంటుంటారు కానీ కొన్ని సార్లు ఏ జోరీగా లేకపోయినా ఏదో తిరుగుతున్నట్టుగా మెదడులో రొద భరించతరం కాదు. ఒక్కోసారి చెవిలో దురదతో ఏమీ తోచదు. మరే పనిమీద మనసు కుదరదు. ఇలాంటి సమస్యలు చిన్నవే కానీ.... కానీ ఇవి కలిగించే ఇబ్బంది అది ఎదుర్కొంటున్న వారికే అర్థమవుతుంది. దీపావళి పండగ వెలుగుల పండగ మాత్రమే కాదు టపాసుల పండగ కూడా. టపాసుల శబ్ధాలు కూడా ఉంటాయి. వీటి వల్ల కూడా చెవికి నష్టం జరగవచ్చు. దీని గురించిన కొద్ది పాటి అవగాహన.....

చెవిలో దురద వల్ల మరే పని తోచదు. ఇలా చాలా ఇబ్బంది పెట్టే చెవిలో దురదకు కారణం చాలాసార్లు చెవిలోని చర్మం పొడిబారడమయి ఉంటుంది. కొన్ని సార్లు ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా కావచ్చు. అది ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అయితే దురదతో పాటు చెవి నుంచి స్రావాలు కూడా వస్తుంటాయి.

-ఆటైటిస్ మీడియా - అంటే మధ్య చెవిలో నీరు చేరడం. ఇలా మధ్య చెవిలో నీరు చేరడం వల్ల చెవిలో దురదగా ఉంటుంది.

-సొరియాసిస్ వల్ల కూడా చెవిలో దురద రావచ్చు. ఒక్కోసారి సొరియాసిస్ చెవిలోపలే ప్రారంభం కావచ్చు.

-చెవిలో చుండ్రు చేరడం వల్ల కూడా చెవిలో దురద వచ్చే అవకాశాలున్నాయి. ఎందుకంటే చెవిలోపలి చర్మం, తల పై ఉండే చర్మం ఒకే విధమైనవి. చాలా సందర్భాల్లో తలలో కూడా చుండ్రు ఉన్నపుడే చెవిలోనూ చుండ్రు చేరుతుంది కానీ కొన్ని సార్లు కేవలం చెవిలో మాత్రమే కూడా చుండ్రు ఉండవచ్చు.

-చెవిలో వ్యాక్స్ ఎక్కువగా పోగుపడిపోవడం కూడా దురదకు కారణం అవుతుంది.

-సాధారణంగా దురద దానంతటదే తగ్గిపోవాలి. అలా తగ్గడం లేదంటే తప్పనిసరిగా డాక్టర్‌ని కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. పొడి చర్మం వల్ల దురదగా ఉన్న వారికి చర్మంలో తేమ నిలిపి ఉంచేందుకు క్రీములు, చెవిలో తడి ఎక్కువగా ఉండడం వల్ల లేదా ఇన్‌ఫెక్షన్ వల్ల దురద వచ్చేట్టయితే డ్రాప్స్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని డాక్టర్ సలహాతో వాడడం వల్ల దురద నుంచి విముక్తి పొందవచ్చు. లేదా మరే ఇతర కారణంతోనైనా దురద వస్తుంటే దానికి చికిత్స తీసుకోవడం ద్వారా చెవిలో దురద తగ్గిపోతుంది.

**శబ్దాలు**

కొంత మందికి చెవిలో నిరంతరంగా ఏదో ఒక శబ్ధం వినిపిస్తున్నట్టుగా ఉంటుంది. ప్రశాంతంగా ఉన్న సమయాల్లో, నిద్రలో ఈ శబ్ధాలు ఎక్కువగా ఉన్నట్టుగా అనిపిస్తుంది. వీటి వల్ల జీవితంలో ప్రాశాంతత లోపించిన భావన కలుగుతుంది. అయితే ఇలా చెవిలో శబ్ధాలు రావడానికి చాలా కారణాలుంటాయి. మెదడులో శ్రవణ నాడికి పైన చెవికి శ్రవణ నాడికి మధ్య భాగంలో ఉండే కాక్లియాలో ఉండే ఎయిర్ సెల్స్‌లో వచ్చే తేడాల వల్ల ఇలా చెవిలో రణగొణ ధ్వనులు రావచ్చు. ఇలా చెవిలో శబ్ధం రావడాన్ని టినిటస్ అంటారు.

మన మెదడు ఒకసారి ఒకే శబ్ధాన్ని స్పష్టంగా గ్రహించగలుగుతుంది. మరేదైనా ఇతర శబ్ధాల మీదకు దృష్టిని మళ్లించడం ద్వారా వీటి నుంచి విముక్తి పొందవచ్చు. లేక ఇది భరించడం ఇబ్బందిగా ఉన్న వారికి టినిటస్ మాస్టర్ అనే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. మెదడు ఒకే శబ్ధాన్ని గ్రహించగలుగుతుంది కాబట్టి అతి తక్కువ ఫ్రీక్వెన్సీలో వైట్ నాయిస్‌ను మెదడుకు చేరవేస్తుంది. అందువల్ల మెదడు చెవిలో ఏర్పడుతున్న ధ్వనిని గుర్తించదు అందువల్ల శబ్ధాలు తగ్గిపోయిన భావన కలుగుతుంది.

ఇలా శబ్ధాలతో పాటుగా కళ్లు తిరగడం, తలనొప్పి, వినికిడి తగ్గడం, వాంతుల వంటి లక్షణాలుంటే మాత్రం వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇలాంటి సందర్భాలు మరేదైనా ప్రమాదరకరమైన స్థితి లక్షణం కావచ్చు. కాబట్టి ఎందుకు ఇలాంటి శబ్ధాలు వస్తున్నాయనే విషయాన్ని తప్పనిసరిగా నిర్ధారించు కోవాల్సి ఉంటుంది.

**నొప్పి**

చెవిలో నొప్పి భరించతరం కానీ విధంగా ఉంటుంది. చెవిలో నొప్పి రావడానికి చాలా కారణాలున్నాయి.

-చెవిలో ఇన్‌ఫెక్షన్ రావడం

-చెవిలో ట్యూమర్లు ఏర్పడడం

-దవడ కీలులో ఏదైనా చిన్న సమస్య వచ్చినా కూడా చెవిలో నొప్పి రావచ్చు

-పంటి నొప్పి వల్ల కూడా చెవిలో నొప్పి రావచ్చు

-ముక్కు వెనుక భాగంలో వచ్చే క్యాన్సర్ వల్ల కూడా చెవిలో నొప్పి రావచ్చు.

-చెవిలో పాలిప్స్ ఏర్పడినపుడు, టాన్సిల్స్‌లో ఇన్‌ఫక్షన్‌హైస్టైలాల్జియా అనే నాడిలో వచ్చే సమస్య వల్ల కూడా చెవిలో నొప్పి వస్తుంది.

-చెవిలో నొప్పి ఏ కారణంతో వస్తుందో నిర్ధారణ చేసుకొని దానికి చికిత్స అందించడం ద్వారా చెవి నొప్పిని దూరం చేసుకోవచ్చు.

**కొన్ని జాగ్రత్తలు..**

టపాసుల నుంచి వచ్చే పెద్దపెద్ద శబ్ధాల వల్ల పిల్లలు, వృద్ధులు, గర్భవతుల్లో అవాంఛనీయమైన పరిణా మాలకు కారణం కావచ్చు. కాబట్టి వీరు టపాసులకు దూరంగా ఉండడమే మంచిది.

కేవలం శబ్ధాలు మాత్రమే కాదు వాటి నుంచి వెలువడే పొగ వల్ల అలర్జీలు కూడా రావచ్చు. ఇవి కళ్లు, ముక్కు, చెవి, గొంతు ఆరోగ్యాలకు హానికరం కావచ్చు. వీలైనంత వరకు బాణాసంచా కాల్చకపోవడమే ఆరోగ్యానికి మంచిది.

# కిడ్నీలు ఫెయిలైతే?

మన శరీరంలో అతిముఖ్యమైన అవయవా లలో కిడ్నీలు (మూత్రపిండాలు) జీవనక్రియల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. మనం తీసుకునే ఆహారపు అలవాట్లు, ఇతర్రతా కారణాల వల్ల కిడ్నీ సంబంధ సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రతి యేటా 17శాతం కిడ్నీ సంబంధ సమస్యలు పెరుగుతున్నట్లు అంచనా.

**యురినరీ ఇన్‌ఫెక్షన్.......**

మూత్రం పోసే టప్పుడు మంటగా ఉండటం, మాటి మాటికి యూరిన్‌రావడం, బొడ్డు కిందభాగంలో నొప్పి, జ్వరం రావడం యురినరీ ఇన్‌ఫెక్షన్ ముఖ్యలక్షణాలు. దీన్ని మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. ముఖ్యంగా పిల్లలలో దీనికి చికిత్స ఇస్తున్నప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు పాటించడం అవసరం. చికిత్స ఇవ్వడం ఆలస్యం చేసినా, సరె%న చికిత్స ఇవ్వకపోయినా కిడ్నీలు దెబ్బతినే అవకాశముంది.

**డయాలసిస్......**

శరీరంలో రెండు కిడ్నీలు పాడె%పోయి నప్పుడు శరీరంలో అనవసరమె%న, విజర్జించబడిన పదార్థాలు, నీటి పరిణామము ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని బయటకు పంపించే ప్రక్రియను డయాలసిస్ అంటారు.

మిషన్ ద్వారా రక్తాన్ని శుద్ధి చేయడం **(హిమోడయాలసిస్)**.....

ఈ పద్ధతిలో హీమోడయాలసిస్ అనే మిషన్ సాయంతో కత్రిమ కిడ్నీ (డయలె%జర్)లో రక్తాన్ని శుద్ధి చేస్తారు. మిషన్ సాయంతో రక్తాన్ని శుభ్రపర్చి తిరిగి శరీరంలోకి పంపుతుంటారు. రోగి ఆరోగ్యకరంగా ఉండటానికి వారానికి రెండు లేక

మూడు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. హీమోడయాలసిస్ చేసుకునే సమయంలో మంచంపై ఉండగానే రోగి ఆహారం తీసుకోవడం, టీవి చూడటం వంటి పనులు చేసుకోవచ్చు. ప్రతి సారి డయాలసిస్ చేసుకునేందుకు 4గంటల సమయం పడుతుంది.

ప్రతీ సంవత్సరం మార్చి-10న వరల్డ్ కిడ్నీడేను జరుపుకుంటాం. ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్యసంస్థ పిల్లల్లో కిడ్నీ సంబంధ సమస్యలు - ప్రజల్లో అవగాహన'' అనే అంశాన్ని థీంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారు. వీరిలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే కిడ్నీ సంబంధ సమస్యలు, ఇతర కిడ్నీ సంబంధ సమస్యలను మొదట్లోనే గుర్తిస్తే చికిత్సను అందించడంతో వారు ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు అవకాశముంటుంది. పిల్లల్లో కిడ్నీ సంబంధ అనారోగ్యాలు వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. సాధారణ ఇబ్బందుల నుంచి మొదులుకొని ప్రాణహాని వరకు దారితీయవచ్చు.

చిక్కుడు గింజ ఆకారంలో ఉండే రెండు మూత్రపిండాలు ఉంటాయి. ఇవి కడుపులో వెనుక భాగంలో వెన్నెముకకు ఇరువె%పులా ఛాతికి కింది భాగంలో ఎముకల మధ్య సురక్షితంగా ఇమిడి ఉంటాయి. ప్రతీ వ్యక్తిలో కిడ్నీ సాధారణంగా 10సెంటీమీటర్ల పొడవు, 5సెంటీమీటర్ల వెడల్పు ఉంటుంది. దీని బరువు 150 నుంచి 170 గ్రాముల వరకు ఉంటుంది. కిడ్నీలు శరీరంలోని రక్తన్ని శుద్ధిచేసి వ్యర్థాలను మూత్రవిసర్జన ద్వారా బయటకు పంపుతుంది. వీటితో పాటు శరీరంలో నీటిసమతుల్యత, బ్లడ్ ప్రెషర్, రక్తపు గడ్డలు, కాల్షియం నియంత్రణ చేస్తుంది. మనశరీరంలో ప్రతి రెండు నిమిషాలకు రెండు కిడ్నీలలో 1200 మి.లీ. రక్తం శుభ్రమవుతుంది. 24 గంటల్లో సుమారు 1700 వందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

**కిడ్నీ వ్యాధి లక్షణాలు.......**

'ఉదయం నిద్రలేచిన వెంటనే కళ్ళు వాచి ఉండటం

'ఆకలి తక్కువగా ఉండటం, వాంతులు, వికారంగా అనిపించడం

'రాత్రిళ్ళు ఎక్కువగా మూత్రవిసర్జనకు వెళ్ళాల్సి రావడం

'చిన్న వయస్సులోనే రక్తపోటు వ్యాధి ఉండటం

'కొంచెం నడిచే సరికి ఆయాసం, నీరసంగా అనిపించడం

'6 సంవత్సరాల తరువాత కూడా మంచంపై మూత్రవిసర్జన చేయటం

'మూత్రవిసర్జన సమయంలో మంట, చీము, రక్తం రావటం, మూత్రం బొట్లు బొట్లుగా రావటం.

'కడుపులో పుండ్లు అవటం, కాళ్ళు, నడుములో నొప్పులు కలగటం వంటి లక్షణాలు సాధారణాలుంటే కిడ్నీ సంబంధ వ్యాధిగా గుర్తించి పరీక్షలు చేయించుకోవాలి.

**ఎక్యూట్, క్రానిక్ కిడ్నీ ఫెయిల్యూర్...........**

ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ః-...ఎక్యూట్ కిడ్నీఫెయిల్యూర్‌లో క్రమబద్ధంగా పనిచేస్తున్న కిడ్నీలు హఠాత్తుగా తక్కువ సమయంలో పనిచేయకుండా పోతాయి. దీనికిప్రధాన కారణాలుగా తీసుకుంటే వాంతులు అవడం, మలేరియా, రక్తపోటు వంటి కారణాల వల్ల రావచ్చు.

**క్రానిక్ కిడ్నీ ఫేయిల్యూర్.......**

క్రానిక్ కిడ్నీ ఫేయిల్యూర్‌లో రె ండు కిడ్నీలు మెల్ల మెల్లగా దీర్ఘకాలంలో క్షీణిస్తుంటాయి. శరీరంలో వాపు రావడం, ఆకలి తక్కువగా ఉండటం, వాంతులు, నీసరం, మనస్సు సరిగ్గా లేకపోవడం, తక్కువ వయస్సులోనే రక్తపోటు ఎక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి.




# ఆనందో బ్రహ్మ రివ్యూ



దెయ్యాలతో మనుషుల్ని భయపెట్టే సినిమాల గురించే మనకు తెలుసు. యేటా పదుల సంఖ్యలో ఆ తరహా సినిమాలొస్తుంటాయి. ఒకప్పుడు కేవలం భయానికే పరిమితమైన ఆ సినిమాలు కొంతకాలంగా కామెడీ రంగుని కూడా పులుముకొని హారర్ కామెడీ చిత్రాలుగా ప్రేక్షకుల్ని అలరిస్తున్నాయి. తొలిసారి అందుకు భిన్నంగా మనుషుల్ని చూసి దెయ్యం భయపడే నేపథ్యంతో కూడిన సినిమా అనే ప్రచారంతో ప్రేక్షకుల ద ృష్టిని ఆకర్షించింది... %--%ఆనందో బ్రహ్మ%--%. భయానికి నవ్వంటే భయం అనే కాన్సెప్టుతో తెరకెక్కిన ఆ చిత్రంలో తాప్సి నటించడం మరో ప్రధాన ఆకర్షణ. కొంచెం విరామం తర్వాత తాప్సి తెలుగులో నటించిన చిత్రమిది. మరి ఆమె పునరాగమనం విజయవంతంగా జరిగినట్టేనా? అసలు మనుషుల్ని చూసి దెయ్యం ఎలా భయపడింది?

కథేంటంటే?: సిద్ధు (శ్రీనివాస్ రెడ్డి)కి గుండె జబ్బు. ఏటీఎమ్ దగ్గర సెక్యూరిటీ గార్డుగా పనిచేసే ఫ్లూట్ రాజు (వెన్నెలకిషోర్) తనకున్న రేచీకటి సమస్య వల్ల ఓ కేసులో ఇరుక్కుంటాడు. తాగుడుకి బానిసయిన తులసి (తాగుబోతు రమేష్)కి ఇంట్లో సమస్యలు. బాబు (షకలక శంకర్) సినిమా పిచ్చితో తన షాప్ అమ్మేసి ఇబ్బందుల్లో పడతాడు. ఇలా ఒకొక్కరిదీ ఒక్కో సమస్య. అందరికీ డబ్బు అత్యవసరం. ఈ దశలోనే సిద్ధుకి తాను పనిచేసే బార్‌లో శ్రీలక్ష్మీనిలయం ఇంటి యజమాని రాము (రాజీవ్ కనకాల) పరిచయమవుతాడు. దెయ్యాలున్నాయనే ప్రచారంతో తన శ్రీలక్ష్మీనిలయం అమ్ముడుపోకుండా నిలిచిపోయిందని బాధపడుతుంటాడు రాము. అది విన్న సిద్ధు తాము ఆ ఇంట్లో కొన్ని రోజులు నివసించి దెయ్యాల్లేవని నిరూపిస్తామని, అప్పుడు ఇల్లు సులభంగా అమ్ముడుపోతుంది కాబట్టి... వచ్చే లాభంలో తమకు కొంత ఇస్తే సరిపోతుందని సలహా ఇస్తాడు. అందుకు రాము కూడా ఒప్పుకోవడంతో సిద్ధు... ఫ్లూట్‌రాజు, తులసి, బాబులతో కలిసి ఆ ఇంట్లోకి వెళతాడు. మరి ఆ ఇంట్లోకి వెళ్లాక వాళ్లకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? దెయ్యాల్ని చూసి మనుషులు భయపడ్డారా? లేక మనుషుల్ని చూసి దెయ్యాలే భయపడ్డాయా? ఇంతకీ ఆ శ్రీలక్ష్మీ నిలయం ఎవరిది? తదితర విషయాల్ని తెరపైనే చూడాలి.

ఎలా ఉందంటే?: ఒక ఇంటి చుట్టూ సాగే కథ ఇది. మొదట దెయ్యాలు మనుషులుగానే పరిచయమవుతారు. కానీ ఇంట్లోకి మనుషులొచ్చాకే తాము దెయ్యాలమనే విషయం వాటికి అర్థమవుతుంది. అప్పట్నుంచే కథలో ఆసక్తి మొదలవుతుంది. ఆరంభంలో వచ్చే సన్నివేశాలు ఇదివరకు చూసిన దెయ్యాల సినిమాల్నే గుర్తు చేస్తాయి. కిటికీల చప్పుళ్లు, ఉన్నట్టుండి తలుపులు తెరుచుకోవడం వంటి సన్నివేశాలు ఇది కూడా సగటు దెయ్యం సినిమానే అనిపిస్తుంది. కానీ దెయ్యాలకి తాము దెయ్యాలమని తెలిశాక కథలో వేగం పుంజుకొంటుంది. ఆ తర్వాత ఆ ఇంట్లోకి వెళ్లే నలుగురు పాత్రల్ని పరిచయం చేసే సన్నివేశాలతో సినిమా సరదా సరదాగా సాగిపోతుంది. ద్వితీయార్ధంలోనే సినిమా అసలు కథలోకి ప్రవేశిస్తుంది. దెయ్యాల ఇంట్లో నివసించడానికి వెళ్లిన నలుగురికి నాలుగు రకాల సమస్యలు ఉండటం, ఆ సమస్యల గురించి దెయ్యాలకి తెలియకపోవడం, దాంతో మనుషులేంటి ఇలా ప్రవర్తిస్తున్నారని అవి భయపడటంతో ఆయా సన్నివేశాలు రక్తికడతాయి. దెయ్యం నేపథ్యంలో ఇదివరకు వచ్చిన చిత్రాలకి భిన్నంగా సాగే చిత్రమిది. కొన్నిసార్లు దెయ్యాలు మనుషులకి భయపడుతుంటాయి. దాంతో కామెడీ బాగా పండింది. అసలు ఆ ఇంట్లో మనుషులు దెయ్యాలుగా ఎలా మారారనే అంశం కూడా కథలో ఆసక్తిని రేకెత్తించేలా తీర్చిదిద్దాడు దర్శకుడు. సంక్లిష్టమైన ఈ కథని దర్శకుడు చాలా స్పష్టతతో తీర్చిదిద్దాడు.


ఎవరెలా చేశారంటే?: మొదట్నుంచీ తాప్సినే సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తూ వచ్చింది. అయితే తాప్సితో పోలిస్తే శ్రీనివాస్‌రెడ్డి, షకలక శంకర్, వెన్నెలకిషోర్, తాగుబోతు రమేష్ పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. తాప్సి పాత్ర భయపెట్టింది తక్కువే, అలాగే నవ్వించిందీ లేదు. మంచి కథలో భాగమయ్యాననే సంత ృప్తి ఆమెకి లభిస్తుందంతే. శ్రీనివాసరెడ్డి, వెన్నెలకిషోర్, షకలక శంకర్, తాగుబోతు రమేష్ పాత్రలు చేసిన సందడే సినిమాకి ప్రధాన బలం. షకలక శంకర్ చేసిన స్పూఫ్‌లు బాగా నవ్వించాయి. తెరపై బోలెడన్ని పాత్రలు కనిపిస్తాయి. అయితే ఆ స్థాయిలో మాత్రం నవ్వులు పండలేదు. ఆయా నటులు పాత్రల పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. కె సంగీతం, అనిష్ తరుణ్‌కుమార్ కెమెరా పనితనం చక్కగా కుదిరింది. దర్శకుడు మహి వి.రాఘవ్ కథని రాసుకొన్న విధానం, దాన్ని తెరపైకి తీసుకొచ్చిన విధానం ఆకట్టుకుంది. నిర్మాణం పరంగా కూడా లోటేమీ కనిపించదు.

# బిగ్‌బాస్‌లోకి మళ్లీ రాను : ఓవియ



తమిళ బిగ్‌బాస్ రియాలిటీ గేమ్ షోలోకి మళ్లీ వచ్చేది లేదని నటి ఓవియ స్పష్టం చేశారు. షోలో తనను కార్నర్ చేసిన వారిని ద్వేషించొద్దని అభిమానులను కోరారు. ఈ మేరకు యుట్యూబ్‌లో వీడియో పెట్టారు. బిగ్‌బాస్ షోలో తనకెదురైన అనుభవాలు, తాను బయటకు వెళ్లిపోవడానికి దారి తీసిన పరిస్థితులు, ఆరవ్‌తో తన ప్రేమాయణం, ఇటీవల మారిన తన హెయిర్‌స్టైల్ గురించి ఈ వీడియోలో ప్రస్తావించారు. ప్రేమ పట్ల తనకు పూర్తి నమ్మకం ఉందని, తనది నిజమైన ప్రేమని స్పష్టం చేశారు. బిగ్‌బాస్ షో నుంచి తాను బయటకు రావడానికి కారణమైన జూలీ, శక్తిలను కార్నర్ చేయొద్దని అభిమానలకు విజ్ఞప్తి చేశారు. 'మనల్ని ఎవరైనా కార్నర్ చేస్తే ఆ బాధ ఎలావుంటుందో నాకు తెలుసు. అందుకే జూలీ, శక్తిలను కార్నర్ చేయొద్దని కోరుతున్నా. తప్పులు చేయడం మానవ నైజం. దానికి నేను కూడా మినహాయింపు కాదు. అందరిలాగే నేను కూడా పెర్‌ఫెక్ట్ కాదు. కాబట్టి వారిని కార్నర్ చేయొద్దు. అభిమానులు ఇలా చేయడం నాకు ఇష్టముండద'ని వీడియోలో ఓవియ పేర్కొన్నారు. ప్రస్తుతం కేరళలోని కొచ్చిన్‌లో ఆనందంగా గడుపుతున్నానని తెలిపారు. మారిన తన హెయిర్ స్టైయిల్ గురించి చెబుతూ.. కేన్సర్ బాధితుల కోసం తన జుట్టును దానం చేసినట్టు వెల్లడించారు. బిగ్‌బాస్‌ను తిరిగిరానని, వెండి తెరపై తనను ఆదరించాలని అభిమానులను కోరారు.

# రజనీకాంత్ అతిథిగా..



మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం స్పైడర్. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకుడు. తెలుగు, తమిళ భాషల్లో దసరా కానుకగా ప్రేక్షకులముందుకు రానుంది. మహేష్‌బాబు పుట్టిన రోజు సందతరేగా ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అదుతేమైన స్పందన లభిస్తున్నది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలకు భారీగా సన్నాహాలు చేస్తున్నది చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్. చెన్నైలో ఏర్పాటు చేయబోతున్న ఓ కార్యక్రమానికి రజనీకాంత్, ప్రముఖ తమిళ దర్శకుడు శంకర్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని సమాచారం. రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 2.0 థియేట్రికల్ హక్కుల్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో స్పైడర్ ప్రచార కార్యక్రమానికి రజనీకాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారని తెలిసింది.

# యుద్ధానికి సిద్ధం



నాగచైతన్య, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం యుద్ధం శరణం. వారాహి చలన చిత్రం పతాకంపై రజని కొర్రపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ ఆర్.వి. మరిముత్తు దర్శకుడు. శ్రీకాంత్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ట్విట్టర్ ద్వారా శ్రీకాంత్ ప్రకటించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నది.

తను బతకడం కోసం బలవంతుడైన శత్రువుపై తెగింపుతో పోరాడే యువకుడిగా నాగచైతన్య పాత్ర నవ్యరీతిలో సాగుతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి వివేక్‌సాగర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# ప్రభాస్‌తో ఛాన్స్..



ప్రభాస్‌తో కలిసి సాహో సినిమాలో నటించే అవకాశాన్ని దక్కించుకున్నందుకు బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ చాలా ఎగ్జైట్ అవుతోంది. తన ఎగ్జైట్‌మెంట్‌ని ఆపుకోలేని శ్రద్ధా కపూర్ ట్విటర్ వేదికగా తన సంతోషాన్ని వ్యక్తపర్చింది. ఒకవిధంగా శ్రద్ధా కెరీర్‌లో ఇది ఆమెకి ఓ స్పెషల్ మూవీ అనే చెప్పుకోవచ్చు. బాహుబలి సినిమాతో బాలీవుడ్‌లోనూ స్టార్‌డమ్ సంపాదించుకున్న ప్రభాస్ ఆ తర్వాత చేస్తున్న సినిమా ఇదే కావడమే అందుకు ఓ కారణం. అందుకే శ్రద్ధా కూడా అంతగా ఎగ్జైట్ అవుతోంది. రన్ రాజా రన్ ఫేమ్ సుజీత్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాకు హాలీవుడ్ స్టంట్ మాస్టర్ కెన్నీ బేట్స్ ఫైట్స్ కంపోజ్ చేయనుండటం మరో విశేషం. యాక్షన్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కనున్న మూవీ కావడంతో అందుకు అనుగుణంగా రొమేనియా, అబు ధాబి, యూరప్ దేశాల్లో ఈ సినిమాలోని అధిక భాగాన్ని తెరకెక్కించనున్నారు. దాదాపు రూ. 150 కోట్ల బడ్జెట్‌తో రూపొందనున్న 'సాహో' వచ్చే ఏడాది ఆడియెన్స్ ముందుకు రానుంది.

# 'మహానుభావుడు' ఫస్ట్‌లుక్



శతమానం భవతి సినిమాతో హిట్ కొట్టిన శర్వానంద్ ఆ తర్వాత మారుతి డైరెక్షన్‌లో 'మహానుభావుడు' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ప్రస్తుతం మహానుభావుడు సినిమా ఫస్ట్‌లుక్, టీజర్ విడుదలకి ఏర్పాట్లు చకాచకా జరిగిపోతున్నాయి. ఇప్పటికే ఒక పాట మినహా సినిమా మొత్తం షుటింగ్ జరుపుకుంది ఈ సినిమా. ఈ నేపథ్యంలోనే ఈనెల 24వ తేదీన ఫస్ట్ లుక్, టీజర్ విడుదల చేసేందుకు రెడీ అయ్యాడు డైరెక్టర్ మారుతి. దసరా సీజన్‌లోనే తమ సినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నట్టు నిర్మాతలు ప్రమోద్, వంశీ తెలిపారు. తాజాగా మీడియాకు ఈ డీటేల్స్ వెల్లడించిన డైరెక్టర్ మారుతి.. భలే భలే మగాడివోయ్ సినిమా పూర్తి కాగానే శర్వానంద్‌ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ రాసుకున్నట్టు చెప్పాడు. నిన్నటినుంచే ఈ సినిమా డబ్బింగ్ మొదలుపెట్టినట్టు తెలిపాడు మారుతి. భలే భలే మగాడివోయి, బాబు బంగారం లాంటి చిత్రాల తర్వాత మారుతి డైరెక్షన్‌లో వస్తున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కి ఎస్ఎస్ థమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

# అవధుల్లేని ఆనందం



సినిమాల జోరు తగ్గినా సామాజిక మాధ్యమాల్లో మాత్రం అంతులేని అభిమాన గణంతో దూసుకుపోతున్నది గోవా సొగసరి ఇలియానా. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతాను అనుసరించే వారి సంఖ్య ఆరు మిలియన్లకు(అరవై లక్షలు) చేరుకున్నది. ఈ సందర్భంగా ప్రియుడు ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ నీబోన్ తీసిన తన బ్లాక్ అండ్ వైట్ ఫొటోను అభిమానులతో పంచుకున్నది ఇలియానా. ఫాలోవర్స్ సంఖ్య ఆరు మిలియన్లకు చేరుకోవడం అవధులేని ఆనందాన్ని కలగిస్తున్నదని తెలిపింది. సినీ కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితం, ప్రియుడి గురించిన ముచ్చట్లు ఏదైనా నిర్మొహమాటంగా సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకుంటుంది ఇలియానా. అదే ఆమెకు సోషల్‌మీడియాలో భారీ అభిమానగణాన్ని తెచ్చిపెట్టింది. దక్షిణాదికి భిన్నంగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన తొలినాళ్లలో గ్లామర్ పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించిన ఇలియానా గత కొంతకాలంగా నటనకు ఆస్కారమున్న పాత్రలవైపు మొగ్గుచూపుతున్నది. ప్రస్తుతం హిందీలో చారిత్రక కథాంశంతో తెరకెక్కుతున్న బాద్‌షాహొ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.

అవకాశాలొస్తే దక్షిణాది చిత్రాల్లో నటించాలనుకుంటున్నానని, మంచి కథల కోసం ఎదురుచూస్తున్నానని చెప్పింది ఇలియానా.

# ఘనంగా ఎమ్మెల్యే పీలా జన్మదిన వేడుకలు






అనకాపల్లి : అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంఘా జరిగాయి. స్ధానిక నూకాంభిక అమ్మవారి ఆలయ కళ్యాణ మండపంలో అభిమానులు కేరింతల నడుమ కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకి కార్యకర్తలు అభిమానులు, నాయకులు, ఆలయ ముఖద్వారం వద్ద స్వాగతం పలికారు. పెద్దఎత్తున బాణా సంచా కాల్చారు. అభిమానులు పీలాకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఆలయం వద్దకు తోడుకుని వెళ్లారు. ఆలయం ఇవో ఎన్. సుజాత, ఎమ్మెల్యేకి స్వాగతం పలికి గర్భ గుడిలోకి తీసుకుని వెళ్లారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో పూజ నిర్వహించి ఆశర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా పీలా మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పీలాకు ఎంపి అవంతి శ్రీనివాసరావు గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆర్ఇసిఎస్ చైర్మన్ కొటాన అప్పారావు, విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, కొణతాల వెంకటరావు, కరణం శ్రీనివాసరావు (చెక్కలన్న), ఎఎంసి డైరెక్టర్ శెట్టి వెంకటరమణ, శెట్టి పైడియ్యనాయుడు, డాక్టర్ విష్ణుమూర్తి సత్యవతి, సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థాన చైర్మన్ ధనాల విష్ణుచౌదరి, జిల్లా తెలుగుయువత సమన్వయ కార్యదర్శి కొణతాల నూకునాయుడు, సుంకర చంటి, ఎంపిపి కొణతాల వెంకటసావిత్రి, గంగిరెడ్ల గోవింద్, కోట్ని ఈశ్వరరావు, దాడి నాగేశ్వరరావు, నంబారు శ్రీను, కరణం శ్రీనివాసరావు, రేఖారమణమూర్తి, పల్లెల నాగేశ్వరరావు, పూడి కొండలరావు, ఇంటి సూరిబాబు, నక్కా చెల్లయ్య, పోల్నాటి అప్పారావరు, సాయిరాం విజిటబుల్స్ అధినేత యల్లపు రాము, యల్లపు వెంకటరమేష్, ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింధ సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా నూకాంబిక ఆలయ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అందరినీ ఆకట్టుకుంది. జిల్లా తెలుగుయువత, సమన్వయ కార్యదర్శి కొణతాల నూకునాయుడు ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. గత మూడేళ్లలో ఎమ్మెల్యే పీలా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, సేవా కార్యక్రమాలతో కూడిన ఫోటలను ఇందులో ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కార్యకర్తలు, అభిమానులు, ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆశక్తిగా తిలకించారు. ఎమ్మెల్యే కూడా ఎగ్జిబిషన్ పరిశీలించి, నిర్వాహకులను అభినందించారు. ఏది ఏమైనా ఎగ్జిబిషన్‌కు అనుహ్య స్పందన లబించింది.

### పేద మహిళలకు చీరల పంపిణీ

అనకాపల్లి... ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా సుంకరమెట్ట, సత్యనారాయణ, స్వామి దేవస్థాన చైర్మన్ ధనాల విష్ణుచౌదరి, ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేతుల మీదగా పేదలకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 1000 మందికి వీటిని అందజేశారు. పట్టణంలో వార్డు కి 10 మంది చొప్పున, మండలంలో గ్రామానికి 10 మంది చొప్పున పేదలను ఎంపిక చేసి



అర్హులైన వారందరికి చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల నూకునాయుడు, కొణతాల వెంకటరావు, సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్దానం డైరెక్టర్ల్ ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# ఉద్యమంలా మొక్కల పెంపకం



సెక్రటేరియట్ : కరవు జిల్లాగా పేరొందిన అనంతలో ఉద్యమంలా మొక్కల పెంపకం చేపట్టాలని కలెక్టర్ వీరపాండియన్ పిలుపునిచ్చారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో జేసీ రమామణి, శిక్షణ కలెక్టర్ వెంకట్వేర్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలంటే మొక్కలు విరివిగా నాటాలన్నారు. జిల్లాలో అడవులు పూర్తిగా అంతరించిపోయాయని, మొత్తం భూభాగంలో అడవులు కేవలం 10 శాతం మాత్రమే విస్తరించి ఉన్నాయి. 50 శాతానికి అటవీ ప్రాంతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాదికి 60 వేల హెక్టార్లు చొప్పున 6లక్షల హెక్టార్లలో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. అందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో 1000 హెక్టార్లు చొప్పున మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఎస్సీ, బీసీ, గిరిజన వసతి గృహాల్లోనూ, నీటిపారుదలశాఖ కింద చెరువు గట్లు, హంద్రీనీవా, హెచ్చెల్సీ కాలువ గట్లు, రోడ్లు, భవనాలశాఖ, జాతీయ రహదారులు, గృహ నిర్మాణ, మున్సిపాలిటీల్లో పార్కులు, దేవాలయ ఆవరణాల్లో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. మొక్కలకు అటవీశాఖ సరఫరా చేయాలని ఆదేశించారు.

# జట్లను ప్రకటించిన ఆసీస్

సిడ్నీ: ఈ ఏడాది భారత పర్యటనకు వచ్చే ఆస్ట్రేలియా జట్లను ఆ దేశ బోర్డు శుక్రవారం ప్రకటించింది. సెప్టెంబరు-అక్టోబరులో ఆస్ట్రేలియా భారత్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో ఆతిథ్య భారత్‌తో కంగారూల జట్టు 5 వన్డేలు, 3 టీ20లు ఆడనుంది. వన్డేల కోసం ఒక జట్టును, టీ20ల కోసం మరో జట్టును ఎంచుకున్న ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు జట్టు సభ్యుల పేర్లను వెల్లడించింది.

గాయంతో బాధపడుతున్న మిచెల్ స్టార్క్‌కు భారత పర్యటనలో చోటు దక్కలేదు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత కూడా నవంబరులో ప్రారంభంకానున్న యాషెస్ సిరీస్‌ని దృష్టిలో ఉంచుకుని స్టార్క్‌కు విశ్రాంతి కల్పించినట్లు బోర్డు ప్రతినిధులు తెలిపారు. పేస్ బౌలర్లు జేమ్స్ ఫాల్కనర్, నాథన్ కౌల్టర్ నైల్, ఆల్‌రౌండర్లు ఆస్టన్ అగర్, హిల్టన్ కార్ట్‌రైట్ వన్డే జట్టులో స్థానం దక్కించుకున్నారు. వన్డే, టీ20 జట్లకు స్టీవ్ స్మిత్ నాయకత్వ బాధ్యతలు వహించనున్నాడు.

**వన్డే జట్టు**

స్టీవ్ స్మిత్(కెప్టెన్), డేవిడ్ వార్నర్(వైస్ కెప్టెన్), ఆస్టన్ అగర్, హిల్టన్ కార్ట్‌రైట్, నాధన్ కౌల్టర్ నైల్, కమిన్స్, జేమ్స్ ఫాల్కనర్, అరోన్ ఫించ్, హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, మాథ్యూ వేడ్, అడమ్ జంపా.

**టీ20 జట్టు**

స్టీవ్ స్మిత్(కెప్టెన్), డేవిడ్ వార్నర్(వైస్ కెప్టెన్), జాసన్ బెహ్రెన్‌డోర్ఫ్, డాన్ క్రిస్టియన్, నాధన్ కౌల్టర్ నైల్, కమిన్స్, అరోన్ ఫించ్, ట్రావిస్ హెడ్, మొయిస్ హెన్రిక్స్, మ్యాక్స్‌వెల్, టిమ్ పైని, కేన్ రిచర్డ్‌సన్, అడమ్ జంపా. ప్రస్తుతం కోహ్లీ సేన శ్రీలంక పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆగస్టు 20న భారత్-శ్రీలంక మధ్య తొలి వన్డే జరగనుంది. ఆసీస్ జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో ఉంది.

# అధికారులూ భేష్ !

## బాలుడిని సురక్షితంగా వెలికి తీసినందుకు సన్మానం




గుంటూరు: గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో బోరుబావిలో పడిన బాలుడిని జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి సురక్షితంగా కాపాడినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా అధికారులను అభినందించారు. సచివాలయంలో కలెక్టర్ కోన శశిధర్, రూరల్ ఎస్పీ వెంకట అప్పలనాయుడులను శాలువా కప్పి సన్మానించారు. అదేవిధంగా జిల్లా అధికారులను, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో మంత్రి ప్రతిపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి జిల్లా వె%ద్య ఆరోగ్య శాఖాధికారి టి.రమేష్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు ఏనుగుపాలెం వె%ద్యాధికారి సునీల్‌నాయక్‌ను అభినందించారు. వినుకొండ మండలం ఉమ్మడివరంలో బోరు బావిలో పడిన బాలుడిని రక్షించేందుకు వె%ద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సత్వరమే స్పందించినందుకు వారిద్దరికీ ఈ అరుదైన గౌరవం దక్కింది. బాలుడు బోరు బావిలో పడిన విషయం తెలియగానే అంబులెన్స్‌లు అక్కడికి వెంటనే పంపించడంతో పాటు ప్రాణవాయువు అందేవిధంగా ఏర్పాట్లు చేయగలిగామని రమేష్ తెలిపారు.

**బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడు..**

బోరు బావి నుంచి ప్రాణాలతో బయటపడ్డ రెండేళ్ల బాలుడు చంద్రశేఖర్ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. గుంటూరు జిల్లా ఉమ్మడివరం గ్రామానికి చెందిన ఆ బాలుడిని సర్వజనాసుపత్రిలోని చిన్న పిల్లల విభాగంలో చేర్పించారు. అప్పటి నుంచి ఆచార్య యశోదర నేతృత్వంలో వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. కాలు వద్ద వాపు ఉన్నప్పటికీ ఎటువంటి గాయం లేదని తేల్చారు. బోరుబావిలో పది గంటలకు పైగా ఉన్నందున ప్రాణవాయువు అవసరమైన మేర అందక మెదడుపై ఏదైనా ప్రభావం ఉటుందేమోనని న్యూరాలజీ విభాగంలో వైద్యులు పరిశీలించి బాగానే ఉందని నిర్ధారించారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రిని కలిసేందుకు అనుమతి రావడంతో ఆ బాలుడితో పాటు తల్లిదండ్రులను తీసుకుని రెవెన్యూ అధికారులు ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లారు. చిన్న పిల్లల విభాగం సహాయ ఆచార్యులు కరిముల్లా వారితో పాటు కలిసి వెళ్లారు.








Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ★ e-mail: vijayabhanudaily@gmail.com